www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -146 సోమవారం 25 ఆగస్టు 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా వినికిడి తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

## సముచిత గౌరవం ఇస్తాం

- సురవరం సుధాకర్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచేలా కేబినెట్ లో నిర్ణయం తీసుకుంటాం: సీఎం రేవంత్ రెడ్డి
- సిపీఐ సీనియర్ నేత సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి సీఎం రేవంత్ నివాళి
- సిద్ధాంతాలకు కట్టుబడిన గొప్ప నేత సురవరం అని కొనియాడిన ముఖ్యమంత్రి
- సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ
- మగ్దూం భవన్‌లో సీపీఐ జాతీయ నేతలతో సీఎం భేటీ, సేవలు స్మరణ



2లో.

## సురవరంకు రెడ్ సెల్యూట్

- నేనంటే సుధాకర్ రెడ్డికి ప్రత్యేక అభిమానం: సీఎం చంద్రబాబు
- సీపీఐ నేత సురవరం భౌతిక కాయానికి సీఎం చంద్రబాబు నివాళి
- హైదరాబాద్ మఖ్దూం భవన్‌లో పార్థివ దేహానికి పుష్పాంజలి
- ప్రజాహితం కోసం ఎన్నో పోరాటాలు కలిసి చేశామన్న చంద్రబాబు
- ఆయన మరణం తెలుగు వారికి తీరని లోటని వ్యాఖ్య
- సురవరం పోరాట వారసత్వాన్ని మనకు ఇచ్చిపోయారని వెల్లడి



# లైఫ్ సైన్సెస్ - మెడికల్ హబ్‌గా తెలంగాణ

- తయారీ రంగం ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం
- ప్రకృతి ఉత్తమ గురువు..నేర్చుకోవాలిగానీ తప్పుచేయొద్దు : బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్-2025 సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: **ఆగస్టు 24, ప్రజావినికిడి,**
లైఫ్ సైన్సెస్, మెడికల్ హబ్‌గా తెలంగాణ నిలిచిందనీ, ఇప్పుడు తయారీ రంగం ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో జరిగిన బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్(ఆసియా-పసిఫిక్)-2025లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ%ొ% బయోడిజైన్ ఉపయోగించి వైద్య ఉత్పత్తుల ఆవిష్కరణల సదస్సులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మనం రూపొందించే దేనిలోనైనా ప్రయోజనం, పనితీరు, రూపం ప్రాథమిక అంశాలుగా ఉంటాయనీ, దేవుడు గొప్ప డిజైనర్..ప్రకృతి ఉత్తమ గురువు అని చెప్పారు. ప్రకృతి నుంచి నేర్చుకోవాలిగానీ తప్పులు చేయొద్దని సూచించారు. కృత్రిమ మెదడును సృష్టించడానికి సహజ మెదడును ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ రైజింగ్-2047లో భాగంగా 2034 నాటికి తెలంగాణను



## నేడు రాహుల్‌తో కలిసి సిఎం రేవంత్ పాదయాత్ర

హైదరాబాద్: **ఆగస్టు 24, ప్రజావినికిడి,**
ఓట్ చోర్ .. గద్దీ చోడ్ పేరిట పాదయాత్ర చేపట్టిన ఏఐసిసి అగ్ర నేత రాహుల్ గాంధీతో కలిసి పాదయాత్రలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం ఢిల్లీ వెళ్ళనున్నారు. ఓట్ల చోరీ జరిగిందని కాంగ్రెస్ దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే రాహుల్ గాంధీ ఈ నెల 26న బీహార్‌లో పాదయాత్ర చేపట్టనున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాదయాత్రలో పాల్గొననున్నారు. అయితే ముఖ్యమంత్రి ముందుగానే ఢిల్లీకి వెళ్ళనున్నారు. బిసి రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి సోమవారం ఢిల్లీలో ప్రముఖ న్యాయనిపుణులతో చర్చించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా న్యాయ కోవిదులతో చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. రిజర్వేషన్లను సాధించే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలగా ఉన్న సంగతి తెలిసిందే. చట్టపరంగా రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాకపోయినా, తమ కాంగ్రెస్ పార్టీ తరపున రిజర్వేషన్లు ఇవ్వాలన్న ఆలోచనతో ఉన్నారు.



2లో.

## డీఆర్‌డీవో మరో ఘన విజయం

- ఆకాశంలో భారత్‌కు అభేద్య కవచం..
- భారత రక్షణ రంగంలో మరో కీలక మైలురాయి
- ఐఏడీడబ్ల్యూఎస్ తొలి ప్రయోగ పరీక్ష విజయవంతం
- ఒడిశా తీరంలో పరీక్షను నిర్వహించిన డీఆర్‌డీవో
- శత్రువుల నుంచి గగనతలానికి బహుళస్థాయి రక్షణ
- అభినందించిన మంత్రి రాజ్‌నాథ్ సింగ్

## రాజీనామా చేసి గెలవండి

### పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

- పదవులకు రాజీనామా చేసి ఉపఎన్నికల్లో గెలవాలని డిమాండ్
- 20 నెలల పాలనపై రేవంత్ రెడ్డి ప్రజాతీర్పు కోరాలని వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వ అప్పులు, హైడ్రా ఆగడాలపై తీవ్ర విమర్శలు
- కేసీఆర్ పాలనలో హైదరాబాద్ అభివృద్ధిని గుర్తు చేసిన కేటీఆర్
- నాయకులు మోసం చేసినా కార్యకర్తలు పార్టీతోనే ఉన్నారని ప్రశంస



హైదరాబాద్**ఆగస్టు 24, ప్రజావినికిడి,**
బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారికి నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే తక్షణమే తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి, ఉప ఎన్నికలను ఎదుర్కొని గెలవాలని ఆయన సవాల్ విసిరారు. ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మిగతాది 2లో...

## భారత్ కు జెలెన్ స్కీ



- కీవ్ పర్యటనలో జెలెన్ స్కీని భారత్ కు ఆహ్వానించిన మోదీ
- ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపర్చుకోవడమే లక్ష్యంగా టూర్
- ఈ ఏడాది చివరిలో రష్యా ప్రెసిడెంట్ పుతిన్ కూడా భారత్ కు రాక

## గణేశ్ మండపాలకు, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్

వినాయక చవితి వేళ తియ్యని కబురు చెప్పిన తెలంగాణ ప్రభుత్వం



2లో.

## బాలకృష్ణకు అరుదైనగౌరవం..

- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి గోల్డ్ ఎడిషన్ గుర్తింపు
- ఈ ఘనత అందుకున్న తొలి భారతీయ నటుడిగా రికార్డ్
- ఆగస్టు 30న హైదరాబాద్‌లో ఘన సన్మాన కార్యక్రమం



2లో.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# సురవరంకు రెడ్ సెల్యూట్

## సీఎం రేవంత్ ,సీఎం చంద్రబాబు నివాళి

హైదరాబాద్**ఆగస్టు 24, ప్రజావినికిడి,**
సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళు లర్పించారు. సిద్ధాంతం కోసం జీవితాంతం పనిచేసిన ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు. నిరుపేదలు, బహుజనుల పక్షాన నిలిచిన గొప్ప నేతను కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో ఉంచిన సురవరం సుధాకర్ రెడ్డి పార్థివదేహాన్ని ముఖ్యమంత్రి సందర్శించి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సీపీఐ జాతీయ నాయకులు డి. రాజా, కె. నారాయణ, కూనంనేని సాంబశివరావు, అజీజ్ పాషాతో మాట్లాడి సురవరం గారితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.
ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "సుధాకర్ రెడ్డి గారు విద్యార్థి దశ నుంచి జాతీయ రాజకీయాల వరకు ఒకే సిద్ధాంతంతో, నిరాడంబరంగా జీవించారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసినా ఏనాడూ అహంకారం దరిచేరనీయలేదు. పాలమూరు బిడ్డగా బూర్గుల, జైపాల్ రెడ్డిల కోవలో ఆయన జిల్లాకు ఎంతో పేరు తెచ్చారు," అని కొనియాడారు.
సురవరం ప్రతాప రెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టాలని గతంలో సుధాకర్ రెడ్డి కోరగానే తక్షణమే అమలు చేశామని సీఎం గుర్తుచేశారు. "విలువలతో కూడిన నాయకులను గౌరవించుకోవడంలో మా ప్రభుత్వం ముందుంటుంది. కొండా లక్ష్మణ్ బాపూజీ, చాకలి ఐలమ్మ, గద్దర్, జైపాల్ రెడ్డిల పేర్లను చిరస్థాయిగా నిలిపాం. అదే విధంగా సుధాకర్ రెడ్డి గారిని కూడా శాశ్వతంగా గుర్తుంచుకునేలా సముచిత నిర్ణయం తీసుకుంటాం," అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా తన సంతాప సందేశాన్ని పంపినట్లు సీఎం తెలిపారు.

### నేనంటే సుధాకర్ రెడ్డికి ప్రత్యేక అభిమానం: సీఎం చంద్రబాబు

సీపీఐ సీనియర్ నేత సురవరం సుధాకర్ రెడ్డితో తనకు ఎంతో కాలంగా రాజకీయ అనుబంధం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటాలు మరువలేనివని కొనియాడారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో ఉంచిన సురవరం పార్థివ దేహానికి చంద్రబాబు పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అనంతరం ఆయనతో తనకున్న జ్ఞాపకాలను అక్కడి నేతలతో పంచుకున్నారు.
ప్రజాస్వామ్య పరిరక్షణకోసం సీపీఐ నేత సురవరం సుధాకర్ రెడ్డి పోరాడారని చంద్రబాబు అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం, దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు.
"సురవరంతో నాకు సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉంది. సుధాకర్ రెడ్డి, నేను కలిసి ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాం. నిత్యం ప్రజాహితం కోసం కలిసి పోరాడాం. ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రజలకు సేవలందించారు. సుధాకర్ రెడ్డి నన్ను ప్రత్యేకంగా అభిమానించేవారు. నేను చేసే పనుల్ని, కార్యక్రమాల్ని అభినందించి ప్రోత్సహించేవారు. ఆయన సేవల్నీ, పోరాటాలను నా జీవితంలో ఎప్పుడూ మర్చిపోలేను. సుధాకర్ రెడ్డి చనిపోయినా పోరాట వారసత్వాన్ని మనకు ఇచ్చిపోయారు. సుధాకర్ రెడ్డి మరణం సీపీఐతో పాటు, తెలుగు వారికి తీరని లోటు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా" అని సీఎం చంద్రబాబు అన్నారు.

# రాజీనామా చేసి గెలవండి

(మొదటి పేజీ తరువాయి)
ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 20 నెలల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకొని ఉప ఎన్నికలకు రావాలని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందామని కేటీఆర్ స్పష్టం చేశారు.పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలలో ఓటమి భయం మొదలైందని కేటీఆర్ అన్నారు. అందుకే వారు రాజీనామా చేసేందుకు వెనుకాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల బ్లాక్‌మెయిల్ దందాల కోసమే 'హైడ్రా' వ్యవస్థ పనిచేస్తోందని, దాని ఆగడాల వల్ల ఒకప్పుడు దేశానికే తలమానికంగా ఉన్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయిందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పు కంటే, రేవంత్ రెడ్డి కేవలం 20 నెలల కాలంలోనే ఎక్కువ అప్పులు చేశారని విమర్శించారు. అభివృద్ధి గురించి మాట్లాడే ధైర్యం రేవంత్ రెడ్డికి ఉందా అని కేటీఆర్ నిలదీశారు. గతంలో కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెట్టిందని కేటీఆర్



గుర్తుచేశారు. 2014లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీఆర్ఎస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నప్పటికీ, కేసీఆర్ నాయకత్వంలో ఆరు నెలల్లోనే విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. దీంతో నగరంలో ఇన్వర్టర్లు, జనరేటర్ల అవసరమే లేకుండా పోయిందన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో రాజకీయాలు చేయకుండా హైదరాబాద్‌ను అన్ని వర్గాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి ఉండేలా అభివృద్ధి చేశామని చెప్పారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ పండుగలకు సమ ప్రాధాన్యత ఇస్తూ మతసామరస్యాన్ని కాపాడామని అన్నారు. అందుకే 2023 ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా గులాబీ జెండాకే పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యేతో సహా పార్టీ మారిన వారంతా ప్రజల కోసం కాదని, కేవలం తమ స్వార్థ ప్రయోజనాలు, ఆర్థిక లాభాల కోసమే కాంగ్రెస్‌లో చేరారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా ప్రజలకు మేలు చేసి ఉంటే, ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి చూపించాలని ఆయన పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం టైంపాస్ మాటలు చెబుతూ, కేసీఆర్‌పైన, తనపైన కేసులు పెడతామని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. నాయకులు పార్టీని మోసం చేసి వెళ్లినా, బీఆర్ఎస్ కార్యకర్తలు మాత్రం గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటున్నారని కేటీఆర్ ప్రశంసించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# తెలంగాణలో మరో నాలుగు రోజులపాటు వర్షాలు

### పశ్చిమ మధ్య, దక్షిణ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం.. తుఫానుగా మారే అవకాశం



హైదరాబాద్: పశ్చిమ మధ్య, దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోందని, ఇది సోమవారం నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుఫానుగా మారే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీంతో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 26వ తేదీ నాటికి బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ తీరానికి తుఫాన్ చేరుకుంటుందని పేర్కొంది. బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్నాయని వాతావరణ కేంద్రం వివరించింది.సోమవారం రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. దీంతో పాటు మరో మూడు రోజులు పలు జిల్లాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

# బిసి బిల్లు విషయాన్ని పరిశీలిస్తా: అమిత్ షా



**ఆగస్టు 24, ప్రజావినికిడి,**
బిసి రిజర్వేషన్ల బిల్లు విషయాన్ని తాను పరిశీలిస్తానని కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు హామీ ఇచ్చారు. ఆదివారం ఢిల్లీలో ఏర్పాటైన స్పీకర్ల సదస్సును కేంద్ర మంత్రి అమిత్ షా ప్రారంభించారు. తేనేటి విందు విరామం సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కేంద్ర మంత్రి అమిత్ షాను కలిసి బిసి రిజర్వేషన్ల బిల్లును రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించి మీకు పంపించడం జరిగిందని చెప్పినట్లు సమాచారం. బిసి రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలిపేలా చూడాలని ఆయన కోరినట్లు తెలిసింది. ఈ విషయమై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గతంలో మిమ్మల్ని కలిసి కోరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అందుకు కేంద్ర మంత్రి అమిత్ షా స్పందిస్తూ తాను పరిశీలిస్తానని చెప్పినట్లు తెలిసింది.

# లైఫ్ సైన్సెస్ - మెడికల్ హబ్‌గా తెలంగాణ

ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ కు కేంద్రంగా ఉందన్నారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను సాధించడంలో వైద్య పరికరాలు, మెడ్‌టెక్ కీలకమైనవని తెలిపారు. ఫార్మా, బయోటెక్, లైఫ్ సైన్సెస్ , మెడ్‌టెక్ వంటివి హైదరాబాద్ లో అత్యంత కీలకమైనన్నారు. తయారీ రంగం నుంచి ఆవిష్కరణలకు కేంద్రంగా తెలంగాణను మారుస్తున్నామని చెప్పారు. సుల్తాన్‌పూర్‌లో 302 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైసెస్ పార్క్‌ను ఏర్పాటు చేశామనీ, అందులో పరిశోధన, పరీక్ష, తయారీ కోసం ఉత్తమ మౌలిక సదుపాయాలను అందిస్తున్నామని వివరించారు. అక్కడ 60కి పైగా దేశీయ, అంతర్జాయతీయ కంపెనీలు పనిచేస్తున్నాయని తెలిపారు. డయాగ్నస్టిక్ పరికరాలు, ఇమేజింగ్ టెక్నాలజీలు, ఇంప్లాంట్లు, శస్త్రచికిత్స పరికరాలు, డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్‌లో పెట్టుబడులు వస్తున్నాయని వివరించారు. స్థానిక స్టార్టప్‌లు, ఎమ్ఎస్ఎమ్ఈలు గ్లోబల్ కంపెనీలతో పాటు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం పరిశోధనలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, ఏఐజీ ఆస్పత్రి బృందాన్ని అభినందించారు. డేటా గోప్యతను పాటిస్తూనే ఇక్కడ ప్రజల వైద్యసహాయం కోసం అవసరమైన డేటాను అందజేస్తామని ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీ, కార్పొరేషన్లు, విద్యా సంస్థలు, రీసెర్చ్ సెంటర్లతో అనుసంధానం చేస్తామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయనీ, పన్నులు, యుద్ధాలు,వాణిజ్యపరమైన అడ్డంకులు వంటివి ఎదురవుతున్నాయని తెలిపారు.

# గణేశ్ మండపాలకు, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్

హైదరాబాద**ఆగస్టు 24, ప్రజావినికిడి,**
తెలంగాణలో పండుగ వాతావరణం నెలకొంటున్న వేళ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవ నిర్వాహకులకు ఒక తీపికబురు అందించింది. వినాయక చవితి, దసరా నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసే గణేశ్, దుర్గామాత మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని, అయితే నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొంది ఉండాలని స్పష్టం చేసింది.
ఈ నెల 27వ తేదీ నుంచి గణేశ్ చతుర్థి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ నిర్ణయంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాజధాని హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో మండపాల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముఖ్యంగా, తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహ నిర్మాణ పనులు తుది ఘట్టానికి చేరుకున్నాయి.ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ప్రకటించడంతో ఈ ఏడాది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో మండపాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గనుంది.

# డీఆర్‌డీవో మరో ఘన విజయం

- **ఐఏడీడబ్ల్యూఎస్ తొలి ప్రయోగ పరీక్ష విజయవంతం**

**ఆగస్టు 24, ప్రజావినికిడి,**భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) తన అమ్ములపొదిలో మరో శక్తిమంతమైన అస్త్రాన్ని చేర్చింది. దేశ రక్షణ సామర్థ్యాలను కొత్త శిఖరాలకు చేర్చే క్రమంలో శనివారం ఒడిశా తీరంలో ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (ఐఏడీడబ్ల్యూఎస్) తొలి ప్రయోగ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. ఈ విషయాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోషల్ మీడియా పోస్టులో వెల్లడించారు.ఈ చారిత్రాత్మక విజయంపై డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను, భారత సాయుధ దళాలను, పారిశ్రామిక వర్గాలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. "ఐఏడీడబ్ల్యూఎస్ విజయవంతమైన అభివృద్ధికి కృషి చేసిన డీఆర్‌డీవో, సాయుధ దళాలు, పరిశ్రమలకు నా అభినందనలు. ఈ ప్రత్యేకమైన ప్రయోగ పరీక్ష మన దేశ బహుళస్థాయి గగనతల రక్షణ సామర్థ్యాన్ని రుజువు చేసింది. శత్రువుల వైమానిక దాడుల నుంచి దేశంలోని కీలక ప్రాంతాలకు, ముఖ్యమైన సంస్థలకు ఇది మరింత పటిష్ఠమైన రక్షణ కల్పిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (ఐఏడీడబ్ల్యూఎస్) అనేది ఒకే వ్యవస్థ కాదు. ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన బహుళస్థాయి రక్షణ వ్యవస్థ. ఇందులో క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (క్యూఆర్‌శామ్), అడ్వాన్స్‌డ్ వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (వీషోరాడ్స్) క్షిపణులతో పాటు అధిక శక్తివంతమైన లేజర్ ఆధారిత డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ (డీఈడబ్ల్యూ) కూడా ఉన్నాయి. ఈ వ్యవస్థలన్నీ కలిసి భారత గగనతలానికి ఒక అభేద్యమైన రక్షణ కవచంగా పనిచేస్తాయని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# బాలకృష్ణకు అరుదైన అంతర్జాతీయ గౌరవం.. తొలి భారతీయ నటుడిగా రికార్డ్

### వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి గోల్డ్ ఎడిషన్ గుర్తింపు



హైదరాబాద్**ఆగస్టు 24, ప్రజావినికిడి,**
నటసింహం నందమూరి బాలకృష్ణ తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఒక అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని అందుకున్నారు. భారతీయ సినీ పరిశ్రమలో కథానాయకుడిగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, బ్రిటన్ కు చెందిన ప్రతిష్ఠాత్మక 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' ఆయనకు 'గోల్డ్ ఎడిషన్ రికగ్నిషన్' పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మైలురాయిని చేరుకుని, ఈ గౌరవాన్ని పొందిన తొలి భారతీయ నటుడిగా బాలకృష్ణ చరిత్ర సృష్టించారు.యాభై ఏళ్ల పాటు హీరోగా కొనసాగడం అనేది భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అరుదైన విషయం. ఈ విశేషమైన ఘనతను గుర్తించిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ, బాలకృష్ణ సినీ ప్రయాణాన్ని ప్రశంసిస్తూ ఈ పురస్కారాన్ని ప్రకటించినట్లు తెలుస్తోంది. ఈ చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని ఆగస్టు 30వ తేదీన హైదరాబాద్‌లో ఒక భారీ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ వేడుకలో బాలకృష్ణకు అధికారికంగా పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ వార్త తెలియగానే ఆయన అభిమానులు సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# భారత్ కు జెలెన్ స్కీ

### కీవ్ పర్యటనలో జెలెన్ స్కీని భారత్ కు ఆహ్వానించిన మోదీ

**ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపర్చుకోవడమే లక్ష్యంగా టూర్**

**ఈ ఏడాది చివరిలో రష్యా ప్రెసిడెంట్ పుతిన్ కూడా భారత్ కు రాక**

ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్ స్కీ త్వరలో భారత్ లో పర్యటించనున్నట్లు సమాచారం. ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగు పర్చుకోవడమే ఈ పర్యటన ఉద్దేశమని ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పోలిష్ చుక్ తెలిపారు. జెలెన్ స్కీ పర్యటనకు సంబంధించి తేదీలను ఖరారు చేయడంపై కసరత్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గతేడాది ఆగస్టులో కీవ్ ను సందర్శించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని భారత్ కు ఆహ్వానించారు.
ఉక్రెయిన్‌లో శాంతి కోసం ప్రధాని మోదీ ఒత్తిడి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు సందర్భాల్లో ఉక్రెయిన్, రష్యా మధ్య శాంతి కోసం వాదిస్తూ "ఇది యుద్ధ యుగం కాదు" అని నొక్కి చెప్పారు. పుతిన్, జెలెన్ స్కీలతో టెలిఫోన్ సంభాషణలు జరిపారు. భారతదేశం రెండు దేశాల మధ్య శాంతిని కోరుకుంటుందని వెల్లడించారు. మరోవైపు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ఈ ఏడాది చివరలో భారత్ కు రానున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం 25 ఆగస్టు 2025

# ఎవరి కోసం "నటన"రాజన్ యాత్ర..

## అధికారంలో ఉన్నారా ప్రతి పక్షంలో ఉన్నారా..?

### బిజెపి నాయకురాలు ఎం.రాజేశ్వరి..



**ప్రజావినికిడి,(మెట్టుగూడా):** తెలంగాణ రాష్ట్రంలో ప్రజాహిత యాత్ర పేరిట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ చేస్తున్న యాత్ర కేవలం నటన కోసం మాత్రమే అన్నట్లుగా ఉందని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నదా లేదా ప్రతిపక్షంలో ఉన్నదా అని తెలంగాణ ప్రజలు అయోమయంలో ఉన్నారని బీజేపీ రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి విమర్శించారు.మెట్టుగూడ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ, కేంద్రంలో అలాగే దేశంలోని ఇరవై రాష్ట్రాల పైచిలుకు బీజేపీ అధికారంలో ఉంటే తెలంగాణ రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలో ఉందనుకొని ఊహించి కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నట రాజన్ పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవాచేశారు.ప్రజాహిత యాత్ర అని కాకుండా ఆరు గ్యారంటీలు 420 హామీలతో అధికారంలో వచ్చి అమలు చేయనందుకు ప్రజలు క్షమించాలి అనే పేరుతో యాత్ర చేపడితే బాగుండేదని అన్నారు.మహిళకు తులం బంగారం నెల నెల 2500 వందలు అయిదు వందలకే సిలిండర్ అని మహిళలను మోసం చేసినందుకు మహిళల పక్షాన మీనాక్షి నటరాజన్ తెలంగాణ ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు.యాత్రలో కాంగ్రెస్ నాయకులు యూరియాను నల్ల బజార్ కు తరలిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తూ కేంద్రాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. యూరియా కోసం,రెండు లక్షల రుణమాఫీ కోసం రైతులు కాంగ్రెస్ నాయకులను ప్రజాపాలన ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అని కాంగ్రెస్ నాయకులను నిలదీస్తున్నారని అన్నారు.


## వామపక్షాలకు దొరికిన వరం సురవరం సుధాకర్ రెడ్డి


### అస్తమించిన ఎర్ర సూర్యుడు జోహార్ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.శ్రీను ఆధ్వర్యంలో షాద్ నగర్ నియోజకవర్గ ముఖ్య కడలిలో సురవరం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన సీపీఐ నాయకులు..శ్రీను మాట్లాడుతూ, సురవరం సుధాకర్ రెడ్డి తన జీవితం కమ్యూనిస్ట్ పార్టీ ఉద్యమానికి అంకితం అంటూ తాను కార్మికుల,కర్షకుల, పేదల పక్షాన నిరంతరం పోరాటం చేస్తూ వారి హక్కులను సాధించడానికి అనేక ఉద్యమ మార్గాలను చూపించినటువంటి మహోన్నతంమైనా వ్యక్తి కాంగ్రెస్ సురవరం సుధాకర్ రెడ్డి కొన్ని దశాబ్దాలు సీపీఐ పార్టీ తెలంగాణ రాష్ట్రం తో పాటు భారతదేశ వ్యాప్తంగా కమ్యూనిస్ట్ పార్టీ బలోపేతానికి ఆహర్నిషలు కృషి చేసిన గొప్ప వ్యక్తి సురవరం ఇలాంటి గొప్ప వ్యక్తి ని కోలుపోయాం అంటే కమ్యూనిస్ట్ పార్టీకి తీరని లోటు వారి ఆశయ సాధనలో మేము అందరం కంకణ బద్దలై ఉద్యమ పోరాటలు నిర్వహిస్తామని వారు మాట్లాడారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ షాద్ నగర్ నాయకులు కోరారు. విద్యార్థి దశ నుంచి పార్టీ త్యాగ యాత్రలో, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతర పోరాటం సాగించారు.ఎర్ర జెండా పట్ల మీ నిబద్ధత,ధైర్యం, క్రమశిక్షణ తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి అన్నారు. మీకున్న ఆలోచనలూ, మార్గదర్శకత్వం ఎప్పటికీ మాతోనే ఉంటాయి అని చెప్పారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య నర్సింహ రెడ్డి మండల కార్యదర్శులు గడ్డం గంజయ్య గోవింద్ నాయక్,లింగం నాయక్ రమేష్ రవి నర్సింహ ఏఐ ఎస్ ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్ నాయక్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ విగ్రహం తీసుకు వెళ్తుండగా విద్యుత్ తీగలు తగిలి స్పార్క్ రావడంతో మంటలు..





**ప్రజావినికిడి,(అత్తాపూర్):**రాంబాగ్ లోని మధ్యాహ్నం గణేష్ విగ్రహం తరలిస్తుండగా,పై ఉన్న తీగలను స్పర్శ్ కావడంతో, ఒక్కసారిగా పెద్ద ఎత్తున అగ్ని కణాలు చెలరేగాయి..ట్రాక్టర్ మీదా ఉన్న కొందరు వెంటనే కిందికి దూకడం తో ప్రాణాలతో బయట పడ్డారు.ఒకరికి తల పై ఉన్న ఎంట్రీకలు పూర్తిగా కాలిపోయాయి.అక్కడే ఉన్న విద్యుత్ శాఖా అధికారులు, కరెంట్ ను బంద్ చేయలేదు.మాకు పై నుంచి ఆదేశాలు లేవని, కరెంట్ చేయకపోవడంతో ఈ ఘటన కు దారి తీసింది.ఇందులో ప్రాణాలు కూడా కోల్పోయే అవకాశాలు ఉండే..ఇప్పుడు ఈ ప్రమాదంలో పెద్ద గణేశుడు తెచ్చి సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వలేదా ? లేదా సమాచారం తెలుసుకొని అక్కడే ఉండి ఏమి చేయలేక చూస్తూ నిలబడ్డ విద్యుత్ శాఖా అధికారుల తప్పా తెలియాల్సి ఉంది..

## తెలంగాణ ఆచారాలను సాంప్రదాయాలను ప్రతిబింబించే పండుగనే బోనాలు

### ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి - కాంసాన్ పల్లి గ్రామంలో ఘనంగా మల్లన్న బోనాలు






**ప్రజావినికిడి,(షాద్ నగర్):** తెలంగాణ ఆచారాలను సాంప్రదాయాలను ప్రతిబింబించే పండుగనే బోనాలు అని ఎమ్మెల్సీ నాగర కుంట నవీన్ రెడ్డి అన్నారు.ఫరూక్ నగర్ మండలం కంసాన్ పల్లి గ్రామంలో మల్లన్న బోనాలు అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై మల్లన్న స్వామి ప్రత్యేక పూజ కార్యక్రమంలో మరియు మల్లన్న స్వామి బోనాల ఉత్సవాల ఊరేగింపులో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కంది యాదయ్య గౌడ్, ఎల్లికట్ట కంటెస్టెడ్ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు తోట్ల బాలరాజ్,జయంత్ రెడ్డి,భీమారం రాఘవేందర్ గౌడ్,మహేష్,లింగం, కాకరజాల మల్లేష్, దినేష్,అన్వారీ రాజు, బైండ్ల శివకుమార్, రామకృష్ణారెడ్డి,ఆవ జంగయ్య,వడ్డే కృష్ణయ్య,కంది నరసింహులు గౌడ్,ప్రవీణ్ కుమార్ గొల్ల వెంకటయ్య బి.శివ,హన్మంతు, మైనొద్దీన్ నర్సిములు గౌడ్,మల్లేష్ గౌడ్,అవా క్రిష్ణ,వడ్డే యాదయ్య,చెన్నయ్య గౌడ్,కాకర్జల రమేష్,గణేష్ గౌడ్ సత్యం,శివకృష్ణ,మిద్దె క్రిష్ణ,మహేష్ గౌడ్,గొడుగు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లన్న స్వామి బోనాల జాతర

### శివసత్తుల పూనకాలు, డప్పుదరువుల మధ్య మల్లన్న స్వామికి బోనాలు





**ప్రజావినికిడి, (రాజేంద్రనగర్):ఆగస్టు 24,** రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్పూర్ గ్రామంలో మల్లన్న స్వామి బోనాల జాతర కన్నుల పండువగా జరిగింది.శివసత్తుల పూనకాలు డప్పు దరువుల మధ్య మల్లన్న స్వామికి బోనాలు సమర్పించి ముక్కులు చెల్లించుకున్న భక్తులు.ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నర్ఖూడ గ్రామ వాసి నర్సింగ్ యాదవ్ బోనం.రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బోర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ జాగీర్ మాజీ మేయర్ బోర్ర మహేందర్ గౌడ్ మాజీ ఎంపిపి సత్యనారాయణ,మాజీ ఎంపిపి మామిళ్ళ దశరథ,గడ్డం ముత్యాలు,మల్లేష్ యాదవ్,ముఖ్య ఆహ్వానితులుగా హాజరయ్యారు.శాలువాలతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించిన కమిటీ సభ్యులు.పలు రాజకీయ పార్టీల నేతలు గ్రామస్తులు యాదవ సంఘం సభ్యులు భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

## 4o వ రోజుకు చేరిన టీఎన్జీవోల నిరసన...

### టీఎన్జీవోల హనుమకొండ శాఖ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ నాయకత్వం లో...

### పెద్ద ఎత్తున పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా టిఎన్జీవో ఉద్యోగస్తులు..




**ప్రజావినికిడి,(హైదరాబాద్):ఆగస్టు 24,** టీఎన్జీవో ల యూనియన్ కేంద్ర సంఘ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అలాగే ప్రధాన కార్యదర్శి ముజీబ్ ల ఆదేశానుసారం ఆదివారం భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ ద్వారా గోపనపల్లి లో ప్రభుత్వం టీఎన్జీవో లకు కేటాయించిన భూములు అన్యాక్రాంతం కావడం గురుంచి ఈ రోజు 40 వ రోజు నిరసన లో భాగంగా యూనియన్ హానుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యోగస్తులు తరలివచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. టీఎన్జీవోల హనుమకొండ శాఖ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ నాయకత్వం లో ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మరియు హానుమకొండ




జిల్లా నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లి విన్నూత రీతి లో నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆ టీఎన్జీవో ఉద్యోగులకు భూములను కేటాయించాలని, ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి



సోమయ్య,గౌరవ అధ్యక్షుడు శ్యామ్ సుందర్,కోశాధికారి పి.రాజేష్,కేంద్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మీప్రసాద్,జనగామ జిల్లా అధ్యక్షుడు ఖాజా శారీప్ కార్యదర్శి పి.శ్రీనివాస్,ములుగు అధ్యక్షుడు పోలు రాజు, మహబూబాబాద్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# బాడీబిల్డింగ్ లో భారత్ నుంచి ప్రపంచ ఛాంపియన్లు రావాలి..

## సినీ నటుడు అల్లు శిరీష్..-డెక్కన్ అప్రైజింగ్ 2025 కు అపూర్వ స్పందన..










**ప్రజావినికిడి, (శంషాబాద్):ఆగస్టు 24:**
భారత్ నుంచి క్రికెట్లో ప్రపంచ చాంపియన్లు వచ్చినట్టే,బాడీబిల్డింగ్ లో కూడా ప్రపంచ ఛాంపియన్లు రావాలని సినీ నటుడు అల్లు శిరీష్ కోరారు. శంషాబాద్ లోని ఎస్ఆర్ క్లాసిక్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరిగిన అతిపెద్ద సహజ శరీర దారుఢ్య పోటీలు 'డెక్కన్ అప్రైజింగ్ 2025' కు అపూర్వ స్పందన లభించింది.రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలు ఆదివారం ముగిశాయి.ముఖ్య అతిథిగా విచ్చేసిన అల్లు శిరీష్ మాట్లాడుతూ నా సోషల్ మీడియా పోస్టుల ద్వారా ఫిట్నెస్ అభిమానిగా చాలామందికి తెలుసన్నారు. అన్ని ఫిట్నెస్ వేదికలలో ఈ ఐసీఎన్ ఎంతో ఇష్టమైనది అన్నారు. భారత్ లో బాడీ బిల్డింగ్ అనగానే స్టెరాయిడ్ తో బాడీ బిల్డ్ చేస్తారన్న అపోహ ఉందన్నారు.కానీ ఐసీఎన్ మాత్రం దీనికి విరుద్ధంగా నిలుస్తుందన్నారు.ఇది ప్రపంచవ్యాప్త సహజ బాడీబిల్డింగ్ పోటీ అన్నారు.ఒలింపిక్ క్రీడాకారులను పరీక్షించే వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ ద్వారానే క్రీడాకారులను పరీక్షించనున్నారని తెలిపారు.తద్వారా విజయం ఏళ్ల తరబడి కృషి, క్రమశిక్షణ, అంకితభావానికి ఫలితంగా వస్తుందన్నారు.సహజ బాడీబిల్డింగ్ పట్ల నా ఆసక్తి మళ్లీ పెరిగిందన్నారు.నా ట్రైనర్ తరుణ్.. ఆయన ఒక ఐసీఎన్ అథ్లెట్ అన్నారు.గత ఏడాది నుంచి ఆయన మార్గదర్శకత్వంలో మళ్లీ నా శరీరాన్ని తీర్చిదిద్దుకోగలిగానని చెప్పారు.నిజమైన ఫిట్నెస్ అనేది ఎలాంటి షార్ట్కట్లు లేకుండా సాధించవచ్చనే నమ్మకం కలిగిందన్నారు. హైదరాబాద్ లోనే 450కి పైగా ఐసీఎన్ అథ్లెట్లు ఉన్నారంటే ఆశ్చర్యకరంగా ఉందన్నారు.ఈ సహజ బాడీబిల్డింగ్ కమ్యూనిటీ నిరంతరం విస్తరిస్తూ ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. యువతకు నా విజ్ఞప్తి ఒక్కటే..శరీరాన్ని తీర్చిదిద్దుకోవడానికి స్టెరాయిడ్లు అవసరం లేదన్నారు.సరైన ఆహారం,సరైన ట్రైనర్ మార్గదర్శకత్వం, నిరంతర క్రమశిక్షణ ఉంటే అద్భుతమైన శరీరాకృతిని సాధించవచ్చన్నారు. షార్ట్కట్లు ఆరోగ్యానికి హానికరమన్నారు. ఆరోగ్యం విషయంలోఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడ వద్దన్నారు. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు నా మనవి ఒక్కటే.. బాడీబిల్డింగ్ను అధికారికంగా గుర్తించాలన్నారు. క్రీడాకారులకు స్పాన్సర్షిప్పు అందించాలన్నారు. ఎందుకంటే, బాడీబిల్డింగ్, పవర్లిఫ్టింగ్ క్రీడలు ఒలింపిక్స్లో గుర్తింపు పొందిన క్రీడలు అన్నారు.ఈ గుర్తింపు కూడా లేని క్రికెట్ కు మన దేశంలో ఎంత ప్రాధాన్యం ఉందో అందరికీ తెలుసన్నారు. భారతదేశంలో బాడీబిల్డింగ్ తగిన గుర్తింపును లేకపోయినా,ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు ఉందన్నారు. క్రీడాకారులకు గౌరవంతో పాటు ప్రైజ్ మనీ కూడా లభిస్తుందన్నారు. రెండు రోజుల పాటు అత్యంత ఉత్సాహంగా ఈ పోటీలు జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది జరిగిన 70కు పైగా ఐసీఎన్ పోటీలలో ఇది అతి పెద్దదిగా నిలిచింది.ఈ ఈవెంట్ కు వెల్వర్స్ ప్రెజెంటింగ్ పార్ట్నర్ గా వ్యవహరించింది. దేశ, విదేశాల నుంచి వచ్చిన నాలుగు వందల మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. విభిన్న వయస్సు, వివిధ విభాగాలకు చెందిన వారు ఈ పోటీలో తమ ప్రతిభను ప్రదర్శించారు. బాడీబిల్డింగ్, ఫిట్ఫ్యాషన్,ఫిట్నెస్ మోడలింగ్, ట్రాన్స్ఫర్మేషన్ ఛాలెంజ్ లలో పోటీ పడ్డారు.ఈ సందర్భంగా ఐసీఎన్ ఇండియా,ఐసీఎన్ యూఏఈ అధ్యక్షుడు, డెక్కన్ అప్రైజింగ్ 2025 నిర్వాహకులు జే ఆచార్య మాట్లాడుతూ ఐసీఎన్ ప్రపంచంలోనే అతిపెద్ద సహజ ఫిట్నెస్,సహజ ఫిట్ఫ్యాషన్,సహజ బాడీబిల్డింగ్ వేదిక అన్నారు.క్రీడాకారుల సమాజానికి మద్దతు ఇవ్వడమే తమ లక్ష్యమన్నారు.మానిషి సామర్థ్యాన్ని గరిష్టమాకు ప్రత్యేకత ఇచ్చే అంశం మా డ్రగ్ టెస్టింగ్ విధానం అన్నారు.పాలీగ్రాఫ్ టెస్టింగ్,వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ ప్రోటోకాల్ ప్రకారం టెస్టులు నిర్వహిస్తామని చెప్పారు.మూత్ర నమూనాలు సేకరించి అమెరికాకు పంపించి టెస్టింగ్ చేయిస్తామన్నారు. సహజ ఫిట్నెస్, సహజ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. భారతదేశాన్ని 'మక్కా ఆఫ్ నేచరల్ ఫిట్నెస్'గా నిలబెట్టడమే మా లక్ష్యమన్నారు. హైదరాబాద్ కు ప్రపంచ ప్రమాణాలతో మాదకద్రవ్య రహిత ఫిట్నెస్ పోటీలను తీసుకు వస్తున్నామని చెప్పారు.అథ్లెట్లకు అంకితభావం, అభిరుచిని ప్రదర్శించడానికి అవకాశం కల్పిస్తూ.. కొత్త తరాన్ని ప్రేరేపించనున్నామని తెలిపారు. హైదరాబాద్ లో సహజ ఫిట్నెస్, ఫిట్ఫ్యాషన్,బాడీ బిల్డింగ్లో అద్భుతమైన ప్రతిభ ఉందన్నారు. ఈసారి 400 మందికి పైగా వ్యక్తిగత అథ్లెట్లు పోటీపడుతున్నారని చెప్పారు. 950 పైగా ఎంట్రీలు వచ్చాయన్నారు. దీంతో 'డెక్కన్ అప్రైజింగ్ 2025' మా ఫెడరేషన్లో ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన 70కి పైగా ఈవెంట్లలోనే అతి పెద్దదిగా నిలవనుందన్నారు. ఇది సహజంగా డ్రగ్-ఫ్రీగా ఎలాంటి మందులు వాడకుండా నిర్వహించబడటం చాలా ముఖ్యమైన విషయం అన్నారు. భారత ప్రజలు ఆరోగ్యంగా,ఫిట్గా ఉండటానికి,డ్రగ్-ఫ్రీ క్రీడలను ప్రోత్సహించడానికి ఇది అత్యవసరమన్నారు. ఇది అంతర్జాతీయ స్థాయి పోటీ కావడంతో త్వరలో భారత ప్రతిభను బాలీ, దుబాయ్,ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, యూరప్ మొత్తం, ఫ్రాన్స్,ఇటలీ,బెల్జియం వంటి దేశాలకు తీసుకెళ్తామన్నారు.ఈ సందర్భంగా ఐసీఎన్ ఇండియా హెడ్ జడ్జి జోయ్ కాంట్లిన్ మాట్లాడుతూ, భారతదేశంలో సహజ ఫిట్నెస్,సహజ ఫిట్ఫ్యాషన్,సహజ బాడీ బిల్డింగ్ పోటీలు గత కొన్నేళ్లుగా విపరీతంగా జరుగుతున్నాయన్నారు. ఈ పోటీ ముఖ్య లక్ష్యం చిన్న వయస్సులో సహజ, డ్రగ్-రహిత ఫిట్నెస్ విలువలను అలవాటు చేయడమన్నారు. తద్వారా ఆ అలవాటు జీవితాంతం కొనసాగుతుందన్నారు. ఈ రోజులలో పిల్లలు డిజిటల్ పరికరాలపై అధికంగా మునిగిపోతున్నారని పేర్కొన్నారు.దీంతో చిన్న వయసులోనే ఊబకాయం,టైప్ 2 డయాబెటీస్ కు గురవుతున్నారని చెప్పారు.ఇలాంటి వేదిక వాళ్లకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించే అవకాశం కల్పిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా వెల్వర్స్ సహ వ్యవస్థాపకుడు ఆదిత్య మాట్లాడుతూ, ఒక స్పోర్ట్స్ న్యూట్రిషన్ బ్రాండ్గా భారతదేశంలో సహజ బాడీ బిల్డింగ్కి ఒక సమగ్ర ఎకోసిస్టమ్ను నిర్మించడానికి ఐసీఎన్తో భాగస్వామ్యం కలిగి ఉన్నామన్నారు. డెక్కన్ అప్రైజింగ్ 2025కు మేమే టైటిల్ స్పాన్సర్లు అన్నారు. ఐసీఎన్ పోటీలలో పాల్గొనే అథ్లెట్ల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోందన్నారు. మా లక్ష్యం భారతదేశంలో సహజ బాడీ బిల్డింగ్ను సమగ్రంగా ప్రోత్సహించడం,ఈ రంగంలో దేశం గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందేలా చేయడమన్నారు.

### వేడుక చేసుకునే అద్భుత రత్నాభరణాల సేకరణ

# "వ్యాన"ను ఆవిష్కరించిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్..




**ప్రజావినికిడి,(దిల్సుక్ నగర్):**
బాధ్యతయుతమైన ఆభరణాల వ్యాపార సంస్థగా పేరుగాంచిన ప్రపంచంలోని ప్రముఖ ఆభరణాల ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రతి మహిళ తన ప్రత్యేకతను చాటుకుంటూ వేడుక చేసుకుని అద్భుతమైన సరికొత్త రత్నబ రుణాల సేకరణ అయిన వ్యాసాలు సగవు రంగా ఆవిష్కరించింది ఏ రెండు రత్నాలు ఏ ఇద్దరూ మహిళలు ఒకేలా ఉండరని నమ్మకం నుండి ప్రేరణ పొందిన వ్యాన మహిళల యొక్క వ్యక్తిత్వం వారి అంతర్గత బలం స్వీయ వ్యక్తీకరణకు ఒక ప్రశాం సంగ నిలుస్తుంది. వజ్రంతో ప్రేరేపితమైన తేజస్సును శక్తివంతమైన రత్నాలను 18 22 క్యారెట్ల బంగారంతో ఎంతో శ్రద్ధగా వ్యాన ను సుందరంగా రూపొందించారు వివిధ ప్రాంతాల్లో విభిన్న సంప్రదాయాల్లో సులభంగా పొదిగిపోతూ కాలానికి అనుగుణంగా సులభంగా మారుతున్న ఆధునిక భారతీయ మహిళ కు ఇవి సరైన ఆభరణాలు మహిళల బహుముఖ ప్రతి ఆభరణం ప్రతిబింబం అంతేకాకుండా అంతర్గతంగా దాగి ఉన్న శక్తికి ఒక ప్రశంసగా తనదైన ప్రత్యేక మార్గంలో ప్రకాశిస్తూ సాంప్రదాయాన్ని గౌరవించే స్త్రీ యొక్క గొప్పతనానికి వ్యాస నిదర్శనం గా నిలబడుతుంది మలబార్ గోల్డ్ డైమండ్స్ ఈ ప్రదర్శన చేయనుంది ఆభరణాల తరుగు చార్జీలపై 25% తగ్గింపు పొందవచ్చు వ్యాసరచన సందర్భంగా మలబార్ గ్రూప్ చైర్మన్ శ్రీ ఎంపీ అహ్మద్ మాట్లాడుతూ వ్యాన అనేది కేవలం ఆభరణాల సేకరణ మాత్రమే కాదు ఇది మహిళా స్ఫూర్తి యొక్క అనేక ఛాయల ప్రశంస వ్యాన లోని ప్రతి రత్నం మహిళలని బలం దయ వ్యక్తిత్వం చూపడుతుంది 25 దేశాల నుండి అంకిత భావంతో కూడిన 25 వేల మంది బౌ బాషా నిపుణులతో కూడిన బృందం మద్దతుతో ప్రపంచ ఆభరణాల రిటైల్ వ్యాపారంలో తన స్థానాన్ని ఎప్పటికప్పుడు పెంచుకుంటూ పోతుంది మలబార్ గోల్డ్ డైమండ్స్ 1993లో స్థాపించబడిన మలబార్ గోల్డ్ డైమండ్స్ ప్రముఖ వైవిధ్య భరితమైన భారతీయ వ్యాపార సమ్మేళన సంస్థ అయినా మలబార్ గ్రూప్ యొక్క సంస్థ 6.2 బిలియన్ డాలర్ వార్షిక టర్నోవర్తో ఈ కంపెనీ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఐదవ అతిపెద్ద ఆభరణాల ప్రపంచ స్థానాలలో అగ్రగామిగా ఉన్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారు సూత్రాలు పట్ల మలబార్ గ్రూప్ స్థాపించినప్పటి నుండి బలమైన ప్రాథమిక నిబద్ధతను కలిగి ఉన్నది వ్యాపార సూత్రాలను ప్రధాన వ్యాపారికి అనుసం ధానిస్తూ ఆరోగ్యం గృహ నిర్మాణం ఆకలి లేని ప్రపంచం విద్య మహిళా సాధికారత వదలగు సామాజిక సేవ కార్యక్రమాలను పట్ల మలబార్ గోల్డ్ గ్రూప్ సారిస్తుంది.



# బీసీల హక్కుల కోసం బీసీ జేఏసీ ఆవిర్భావం

### షాద్ నగర్‌లో బీసీ రౌండ్ టేబుల్ సమావేశం




**ప్రజావినికిడి,(షాద్ నగర్):**షాద్ నగర్ నియోజకవర్గంలోని పెన్షనర్స్ భవనంలో బీసీ రౌండ్ టేబుల్ సమావేశం ఘనంగా జరిగింది.ఈ సమావేశంలో బీసీ మేధావులు,కుల సంఘాల ప్రతినిధులు,ప్రజాస్వామికవాదులు విస్తృతంగా పాల్గొన్నారు.సమావేశ ప్రధాన ఉద్దేశం..బీసీలకు సరైన,న్యాయమైన రిజర్వేషన్లు లభించాలన్నది. రాజకీయ పార్టీలకతీతంగా ప్రతి బీసీ బిడ్డ సమాన హక్కుల కోసం కృషి చేయాలని నిర్ణయించారు.బీసీ వర్గాలు ఇప్పటికీ సామాజిక,రాజకీయ, ఆర్థికంగా వెనుకబడినవారని, తరతరాలుగా దోపిడికి గురవుతున్నారని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42%గా నిర్ణయించి బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపడం స్వాగతించదగ్గ నిర్ణయమని పేర్కొంటూనే,కేంద్రం ఇకపై సాకులు చెప్పకుండా పార్లమెంటులో బీసీ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో బీసీ రిజర్వేషన్ల చరిత్రను కూడా ప్రస్తావించారు. 1953లో కాక కలేల్కర్ కమిషన్,1978లో బీ.పీ మండల్ కమిషన్ సిఫార్సులు,1990లో వీ.పీ సింగ్ ప్రభుత్వం 27% రిజర్వేషన్లు అమలు చేసిన తీరు, ఆపై ఇంద్రాసహానే కేసులో 1992లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, 2017లో రోహిణి కమిషన్ నివేదిక %-% వీటన్నిటిని సమీక్షించారు. ఇప్పటివరకు బీసీలకు నిజమైన న్యాయం జరిగినది మండల్ కమిషన్ రిపోర్టు ఆధారంగానే అన్న అభిప్రాయం వ్యక్తమైంది.ఈ సందర్భంగా బీసీ జేఏసీని ఏర్పాటు చేసి నేతలను ఎన్నుకున్నారు.బీసీ జేఏసీ చైర్మన్ గా టి.జి.శ్రీనివాసు, కన్వీనర్ గా కె రవీంద్రనాథ్, కోఆర్డినేటర్ గా యన్.నర్సిములు గౌడ్, వైస్ చైర్మన్ లుగా,బాస వరలక్ష్మి, డి. సురేష్ కుమార్,కో కన్వీనర్లు గా,టి.కరుణాకర్ఎం.వెంకటేష్,పి.శేఖర్ గౌడ్ఎన్ బాలరాజ్ గౌడ్, ( లాయర్) లను ఎన్నుకోవడం జరిగింది.ఈకార్యక్రమంలో పాల్గొన్నవారు ఎం. నర్సింలు రఘునాథ్ యాదవ్,బీసీ జేఏసీ నాయకులు రాఘవేందర్ గౌడ్, వెంకటరమణ,నక్క బాలరాజ్,రాము, మల్లేష్,జనార్దన్, టీపీఎఫ్ అర్జునప్ప,శివకుమార్ గౌడ్,కోట జనార్ధన్, శ్రీశైలం రమేష్ బాలా గౌడ్,కత్తి చంద్రశేఖర్, మేకల వెంకటేష్ ఏ శ్రీనివాస్,తంగడపల్లి శంకర్ జలజ9,నరేందర్,నరేష్ కుమార్,బాగి,గౌతమ్, క్యాసెట్ శ్రీనివాస్, ప్యాట జయ శ్రీకాంత్, అనిత,జ్యోతి, స్రవంతి,తదితరులు పాల్గొనడం జరిగింది.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఎస్సీ వర్గీకరణ పేరిట దళితుల ఐక్యతను దెబ్బ తీసేందుకు దేశ వ్యాప్త కుట్ర

**నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ రాక్స్ అండ్ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్**



**చిత్తూరు ఆగస్టు 24, ప్రజావినికిడి,** చిత్తూరు ప్రెస్ క్లబ్ లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కుట్రలో చంద్రబాబు నాయుడు భాగస్వామి గా మారినట్లు ఆరోపించారు. అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గం పై తెలుగు రాష్ట్రాల్లో కత్తిగట్టాయనీ వాపోయారు. జగన్మోహన్ రెడ్డి దీనిపై కనీసం నోరు మెదపకపోవడం దురదృష్టకరం అన్నారు. జగన్ ఈనాటికి తన స్టాండ్ ఏంటో చెప్పకపోవడం, అత్యంత బాధాకరం అన్నారు. కులాన్ని, మతాన్ని రెచ్చగొట్టి ఈ దేశాన్ని విభజించి, దేశాన్ని అమ్ముకునే పనిలో బిజెపి ఉందని ధ్వజమెత్తారు. రిజర్వేషన్ పేరుతో ఎస్సీలు కొట్టుకు చావండి అనే ఉద్దేశంతోనే ఎస్సీ వర్గీకరణను తెర పైకి తేవడం జరిగిందనీ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ తప్పు అని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సిందే అని డిమాండ్ చేసారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించేంతవరకు ఈ నిరంతర శాంతియుత పోరాటం కొనసాగుతుందనీ చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు వల్లత్తూరు ఉదయ్ కుమార్, మహాసముద్రం కృష్ణ, బుల్లెట్ బాబు దేవా , సంతోష్ కుమార్, పూతలపట్టు ఏసు, దేవా తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల మనోధైర్యం కోసమే అవగాహన సదస్సులు

**- సీనియర్ సిటీజేన్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్**

**జగిత్యాల ఆగస్టు 24, ప్రజావినికిడి,**



వృద్ధుల్లో మనోధైర్యం నింపేందుకు ప్రత్యేక అవగాహన సదస్సులు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,న్యాయవాది హరి ఆశోక్ కుమార్ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలో సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వృద్ధుల ఆత్మహత్యల నివారణ-పిల్లల బాధ్యత,ప్రభుత్వ చట్టాలు,వృద్ధుల సంరక్షణ చట్టం అనే అంశాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. వృద్ధుల కేసుల పరిష్కారంలో కృషి చేస్తున్న హరి ఆశోక్ కుమార్ తోపాటు 36 మంది ప్రతినిధులను సన్మానించారు..ఈ సదస్సులో సీనియర్ సిటీజేన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు, కౌన్సిలింగ్ అధికారి పి.సి.హన్మంత్ రెడ్డి,ఉపాధ్యక్షులు విజయ్, ఎం.డి.యాకూబ్, దిండిగాల విఠల్ ,,డివిజన్ల ప్రతినిధులు పబ్బా శివానందం,రాజ్ మోహన్, వొజ్జల బుచ్చిరెడ్డి, సౌడాల కమలాకర్, బి.రాజేశ్వర్,, యువజన సంఘాల రాష్ట్ర నేత ధోనూరి భూమా చారి , మహిళా సంఘాల నేతలు కస్తూరి శ్రీమంజరి,గంగం జలజ,రాధ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**- కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జాజాల రమేష్**

**జగిత్యాల ఆగస్టు 24, ప్రజావినికిడి,**



రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, న్యాయవాది జాజాల రమేష్ పేర్కొన్నారు.

ఆదివారం జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం నేరెళ్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసారపు బాలగౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొని జాజాల రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూరియా సరఫరా చేయడంలో విఫలమైందని అన్నారు. ఇట్టి విషయాన్ని స్వయంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు లు కొన్ని కేంద్ర ప్రభుత్వ పొరపాటు చర్యల వలన రాష్ట్రంలో యూరియా కొరత ఉన్న మాట వాస్తవమే నని పత్రికాముఖంగా వెల్లడించారని, దీనిపై అవగాహన రాహిత్యంతో స్థానిక బీజేపీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఓ పక్క యూరియా కొరత తో రైతులు ఇబ్బంది పడుతుంటే నేరెళ్ల బీజేపీ నేత 29 బస్తాల రాయితీ డబ్బులు ఏ విధంగా అధికారులకు చెల్లించి పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. బిజెపి నాయకులు కేవలం వారి సామాజిక వర్గానికి, వారి బంధువులకు యూరియా బస్తాలు పంపిణీ చేసి, రైతులందరికీ పంపిణీ చేశామని చెప్పుకోవడం హాస్యాస్పదమని, ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నందుకు బీజేపీ నాయకులు సిగ్గుపడాల్సింది పోయి, బీరాలు పలకడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసారపు బాలగౌడ్,సింగిల్ విండో వైస్ ఛైర్మన్ శేర్ల రాజేశం, ఏఎంసి డైరెక్టర్ మెరుగు పరశురాం,మాజీ ఎంపీటీసీ రెడ్డవేని సత్యం, ఇంద్రాల మల్లేశం, పాల గణేశ్, జుంజురు అశోక్, జంగిలి తిరుపతి, కొదురుపాక మల్లేశం, గొర్రె సురేష్, దాస గణేష్, కొండ గణేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు అండగా ఉంటా

**కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్**



కాకినాడ, ఆగస్టు 24: కాకినాడ జిల్లాలో మత్స్యకారులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా తన వంతు కృషి చేస్తానని కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. పిఠాపురం నియోజవర్గం యు.కొత్తపల్లి మండలానికి చెందిన మత్స్యకార సంఘాల నాయకులు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తో భేటీ అయ్యి పలు సమస్యలపై చర్చించారు. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ, అమీనాబాద్, కోనపాప పేట,మూలపేట తదితర గ్రామాలు చెందిన మత్స్యకారులు వేటకు వెళ్లి కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం,చిన గొల్లపాలెం మరియు డా. బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది నరసాపురం ప్రాంతాల వద్ద తమ మత్స్య సంపదను అన్ లోడింగ్ చేసుకుంటుంటే స్థానిక మత్స్యకారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మొరపెట్టుకున్నారు దీనిపై తక్షణమే స్పందించిన ఆయన మచిలీపట్నం ఎంపీ బాలసౌరి, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ లతో ఫోన్లో మాట్లాడి అక్కడికక్కడే సమస్యను పరిష్కరించారు. అలాగే యు. కొత్తపల్లి మండలం, అమీనాబాద్ హార్బర్ వద్ద రోడ్డును నిర్మించాలని మత్స్యకార నాయకులు విజ్ఞప్తి చేయగా, ఎంపీ లాడ్స్ నిధులతో అభివృద్ధి చేస్తానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు గంటా విజయ్ కుమార్, నక్కా చినబాబు, సురాడ నాగేశ్వరరావు, మరడ కొండయ్య, చోడిపల్లి చిట్టిబాబు,ముడి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికల్లో యాదవుల సత్తా చాటాలి

**- జిల్లా అధ్యక్షుడు పలుమారు మల్లేష్ యాదవ్**

**జగిత్యాల ఆగస్టు 24, ప్రజావినికిడి,**



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులంతా సంఘటితమై సత్తా చాటాలని అఖిల భారత యాదవ మహాసభ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు పలుమారు మల్లేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం సారంగాపూర్ మండల కేంద్రంలో అఖిల భారత యాదవ మహాసభ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు యాదవ సామాజిక వర్గాన్ని గుర్తించి, ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా బీసీ రిజర్వేషన్ స్థానాల్లో యాదవ సామాజిక వర్గానికి చెందిన వారే అధిక సంఖ్యలో గెలుపొందేలా కార్యాచరణ రూపొందించామని, ఆ దిశగా యాదవ నాయకులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సారంగాపూర్ మండల అఖిల భారత యాదవ మహాసభ కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడు గా చెకుంట శేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మానుక తిరుపతి యాదవ్ లను, యువజన విభాగం అధ్యక్షుడు గా ఏన్నూసు మధు యాదవ్, ఉపాధ్యక్షులుగా పొన్నాల రాజ్ కుమార్ యాదవ్ లను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బండ మల్లేశం యాదవ్, ఏరవేణి లక్ష్మణ్ యాదవ్, అధికార ప్రతినిధి బైరీ మల్లేశం యాదవ్, జగిత్యాల రూరల్ అధ్యక్షులు గడ్డి మల్లేశం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఐ సురేష్ బాబును సత్కరించిన నాయకులు



**కోరుట్ల ఆగస్టు 24, ప్రజావినికిడి,**జగిత్యాల జిల్లా కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.సురేష్ బాబును ఆదివారం ఘనంగా సన్మానించారు. రెండు రోజుల క్రితం జగిత్యాల జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాన్ని ముగించుకొని కోరుట్లకు తిరిగి వస్తున్న సమయంలో రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఓ కుటుంబానికి రోడ్డు ప్రమాదం జరిగింది. సిఐ సురేష్ బాబు వెంటనే తన వాహనాన్ని ఆపి, ప్రమాదంలో గాయపడ్డ వారిని తన వాహనంలో ఎక్కించుకొని, కోరుట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి, వైద్య పరీక్షలు చేయించారు. మానవత్వాన్ని చాటిన సీఐ సురేష్ బాబును ఈ సందర్భంగా సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘ రాష్ట్ర నాయకులు బలిజ రాజారెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఇంద్రాల హరీష్, కాంగ్రెస్ నాయకులు బద్ది మురళి, అంబేద్కర్ సంఘ నాయకులు గురుమంతల సత్తయ్య, సామల వేణుగోపాల్, బలిజ సంతోష్ కుమార్, చిన్న రాజం తదితరులు ఉన్నారు.

# శ్రీమద్ భగవద్గీత శిక్షణ తరగతుల ముగింపు

**జగిత్యాల ఆగస్టు 24, ప్రజావినికిడి,**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపు శ్రీ కోదండ రామాలయంలో గత పది రోజులుగా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న శ్రీమద్ భగవద్గీత శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా గాయత్రి పరివార్ నిర్వాహకులు వేముల రాంరెడ్డి మాట్లాడుతూ గత పది రోజుల నుండిశ్రీమద్ భగవద్గీత శిక్షణ తరగతులకు పట్టణంలో ని మహిళలు, భక్తులు పాల్గొని భగవద్గీత శ్లోకాలను వాటి తాత్పర్యాలను నేర్చుకున్నారన్నారు. భగవద్గీత కేవలం పాడుకోవడానికి కాదని, గీతను అర్థం చేసుకుంటే జీవితంలో వచ్చే ఎలాంటి సమస్యకైనా అందులో సమాధానం దొరుకుతుందన్నారు. హైందవ ధర్మ రక్షణకు ప్రతి ఒక్కరు భవద్గీత శ్లోకాలను పఠించాలని సూచించారు. పది



రోజులపాటు భగవద్గీత శ్లోకాలను నేర్చుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. గీతా బోధకుడు వేముల రాంరెడ్డి భవద్గీతలోని ప్రతి శ్లోకానికి అర్థాన్ని వివరిస్తూ ఆనాటి సంఘటనలను కళ్ళకు కట్టినట్టు వివరించిన తీరు పలువురు భక్తులను ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో ఆచార్యులు వేముల రాంరెడ్డి 17వ అధ్యాయం లోని



శ్రద్ధాత్రయ విభాగం గురించి చెబుతుంటే, శ్రోతలు మంత్ర ముగ్ధులయి విన్నారు. ఈ కార్యక్రమం లో పూట్కూరి మాధవ రెడ్డి, బోయినపల్లి భరతేశ్వరరావు, ఎల్లాల రాజేశ్వర్ రెడ్డి, కొండపల్లి హరిప్రియ, ఓరుగొండ సునీల, ఎడవెల్లి దేవారెడ్డి,సామాజిక వేత్త తవుటు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ ఈశ్వర దేవాలయంలో శ్రావణమాసం సమాప్తి





**తాండూరు ఆగస్టు 24, ప్రజావినికిడి,**చెరువు వెంట ఈశ్వర దేవాలయం లో ఆదివారం ఘనంగా శ్రావణ మాస భక్తి సమాప్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భజన మండలి ఆధ్వర్యంలో భారీ ఎత్తున భజన కీర్తనతో ఆధ్యాత్మిక వాతావరణం దేవాలయంలో సంతరించుకుంది. అనంతరం దేవాలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమానికి నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్వాహకులు మాట్లాడుతూ...దినదిన అభివృద్ధి చెందుతున్న ఈశ్వరదేవాలయానికి దాతలు సహకరించాలని అన్నారు. ప్రతి హిందూ పండుగ రోజు వివిధ కార్యక్రమాలతో దేవాలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని దీనికి భక్తుల సహకారం ఎంతగానో అవసరమని దేవాలయ గౌరవ అధ్యక్షులు వాలి శాంత్ కుమార్ అన్నారు.

# నూతన బీటీ రోడ్డుకు శంకుస్థాపన కార్యక్రమం లో పాల్గొన్న నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**సంగారెడ్డి ఆగస్టు 24, ప్రజావినికిడి,**

నారాయణఖేడ్ నియోజకవర్గం

కంగ్టి మండల పరిధిలోని జిర్గి తండా పంచాయతీ పరిధిలోని రామ్ సింగ్ తండాకు నూతన బీటీ రోడ్డుకు శంకుస్థాపన కార్యక్రమం లో పాల్గొన్న నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి,

రామ్ సింగ్ తండాకు రోడ్డు కావాలని ఎన్నో ఏండ్ల కల మా తాతల నాటి కలలను నిజాం చేసి తండా కు రోడ్డును వేయిస్తున్నందుకు తండా వసూలు హర్షం వ్యక్తం చేశారు అలాగే ఎమ్మెల్యే సంజీవరెడ్డి గారి మరియు కాంగ్రెస్ ప్రభుత్వనికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రామ్ సింగ్ తండా కు గతంలో మా నాన్న స్వర్గీయ కిష్టారెడ్డి గారు ఎమ్మెల్యే గా ఉన్నపుడు ఈ తండాకు ఫార్మేషన్ రోడ్డును వేయడం జరిగిందనీ అదే రోడ్డు ఇప్పటి వరకు ఉందని,గత 10 సంవత్సరాల బిఆర్ఎస్ హయాంలో ఈ రోడ్డును ఏ బిఆర్ఎస్ నాయకుడు పట్టించుకున్న పాపాన పోలేదని ఇప్పుడు నేను ఎమ్మెల్యే గా గెలిచిన తరువాత రాష్టంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఖేడ్ నియోజకవర్గంలోని అన్ని తండాల రోడ్డులకు ప్రపోజల్స్ నివేదికలను పంపించమని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి పేదవాడికి ప్రతి సంక్షేమ పథకాన్నీ అందిస్తున్నామనీ అలాగే



గ్రామాలలో ఎంతో అభివృద్ధి చేస్తున్నాం అన్నారు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను మరియు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృత స్థాయిలు తీసుకుపోవాలని రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన ప్రతి ఒక్కరిని గెలిపించాలని ఈ సందర్భంగా అన్నారు

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు వైద్యనాథ్ పాటిల్,బాబు పాటిల్, పల్లవి పరుశురాం,బన్సీ రామ్,శివాజీ మాజీ సర్పంచ్లు,విజయ్,దేవిదాస్, మనోజ్ పాటిల్, జగదీష్ పాటిల్,శివకుమార్,రవి, రాము,సురేష్,లక్ష్మణ్ నాయక్,బాబు, సురేష్,డేవిడ్, తండా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అంతరిక్షం వెళ్లిన తొలి వ్యక్తి హనుమాన్ అన్న బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్.. ట్రోల్స్ చేస్తున్న నెటిజన్లు

అంతరిక్షంలోకి వెళ్లిన తొలి వ్యక్తి హనుమాన్ అని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదానికి దారి తీశాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనా జిల్లాలో ఓ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అనురాగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. అంతరిక్షంలోకి వెళ్ళిన మొదటి వ్యక్తి ఎవరు? అని ప్రశ్నించాడు. దీనికి విద్యార్థులందరూ "నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్" అని సమాధానం ఇస్తారు. అయితే పిల్లలిచ్చిన సమాధానాన్ని ఠాకూర్ ఖండిస్తూ.. నాకు తెలిసి అంతరిక్ష యాత్ర చేసిన తొలి వ్యక్తి హనుమాన్ జీ అంటూ చెప్పుకోచ్చాడు. దీంతో విద్యార్థులందరూ ఒక్కసారిగా షాక్ తిన్నారు. అంతేగాకుండా ఠాకుర్ మాట్లాడుతూ.. మనకు వేల సంవత్సరాల నాటి మన సంప్రదాయం, జ్ఞానం, సంస్కృతి తెలియకపోతే, ఆంగ్లేయులు మనకు చూపించినదే మనం చూస్తాం అందుకే పురాణాల



గురించి కూడా తెలుసుకోండి అంటూ ఠాకుర్ తెలిపాడు. అనంతరం, ఉపాధ్యాయులను ఉద్దేశించి.. పాఠ్యపుస్తకాలకు మాత్రమే పరిమితం కాకుండా, మన వేదాలు, సంప్రదాయాలు, జ్ఞానం వైపు దృష్టి సారిస్తే మనకు చాలా విషయాలు తెలుస్తాయి అని సూచించారు. అయితే ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో, అనురాగ్ ఠాకూర్ పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక నెటిజన్ రాసుకోస్తూ.. ఇలాంటి నాయకులు భారతదేశాన్ని వేల సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారా? కనీసం పాఠశాల పిల్లలకు తప్పుడు జ్ఞానం చెప్పకూడదని అనే విషయం తెలియదా అని కామెంట్ చేశారు. మరో నెటిజన్ కామెంట్ చేస్తూ.. పదవీలో ఉన్న మంత్రులు చదువు, శాస్త్రాలను పక్కనపెట్టి కథలను సైన్స్ గా చెబితే పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. చరిత్ర, పౌరాణిక కథలను గౌరవించడం సరైనదే, కానీ విద్యలో నిజం, విజ్ఞానం మాత్రమే ఉండాలి అంటూ రాసుకోచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన వీడియోను మీరు చూసేయండి.

# పని ఒత్తిడి.. పట్టరాని ఆవేశం తీవ్రస్థాయి నిర్ణయాలకు జైకొడుతున్న యువత



క్రీట్ (గ్రీస్): తొమ్మిది నెలల క్రితం అమెరికాలో జరిగిన ఒక హత్య మిగతా అన్ని నేరాల మాదిరిగా ఒకటి, రెండు రోజులు మీడియాలో పతాకశీర్షికలకెక్కి కనుమరుగుకాలేదు. హత్య చేసిన హంతకుడిని శిక్షించాలనే డిమాండ్లకు బదులు అతడిని కీర్తిస్తూ లక్షలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు పలకడం యావత్ ప్రపంచాన్ని విస్మయపరిచింది. హత్యను ఖండించాల్సిందిపోయి అతడికి బెయిల్ ఇవ్వాల్సిందేనని ఆన్‌లైన్‌లో ఒక ఉద్యమమే మొదలైంది. 2024 డిసెంబర్‌లో అమెరికాలో అత్యంత సంపన్న ఆరోగ్యబీమా సంస్థ అయిన 'యునైటెడ్ హెల్త్‌కేర్'సీఈఓ బ్రియాన్ థాంప్సన్‌ను షూట్‌చేసి చంపేసిన లిగి మాంజియోన్ అనే యువకుడి గురించే ఇదంతా. హత్య వంటి తీవ్రస్థాయి హింసను ఒక సగటు మనిషి తప్పుబట్టాల్సిందిపోయి వెనకేసుకురావడం వెనకున్న అంతరార్థం ఏమిటనే దానిపై ఇప్పుడు మానసిక వైద్యరంగంలో చర్చమొదలైంది. పనిచేసే చోట నెలకొన్న తీవ్రస్థాయి ఒత్తిడి వాతావరణమే యువత మానసిక అలసటకు గురై, పట్టరాని కోపం, అసహనం, ఉద్రేకం దిశగా పయనింపజేస్తోందని పలువురు మనోవిజ్ఞాన శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. థాంప్సన్‌ను హత్యచేయడం సబబేనని ఆన్‌లైన్‌లో నిర్వహించిన సర్వేలో 41 శాతం యువత వ్యాఖ్యానించడం మారుతున్న యువత ఆలోచన ధోరణులకు అద్దంపడుతోందని మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

### అవినీతి, దురాశపై పట్టరాని కోపం

తాము పనిచేసే సంస్థలో జరిగే అవినీతి, సంస్థ ఉన్నతాధికారులు, యాజమాన్యం దురాశను నేటి యువత ఏమాత్రం సహించట్లేదు. తీవ్రస్థాయి పని ఒత్తిడి, అనుక్షణం మారుతున్న సంస్థలో పని విధానాలు, ఆధునిక పని వాతావరణం సైతం యువతలో అసంతృప్తి జ్వాలలను రాజేస్తూ చివరకు వారిలో పట్టరాని ఆవేశాన్ని మరింత ఎగదోస్తోంది. అన్ని రంగాలకు సంబంధించి యువ ఉద్యోగులు, కార్మికుల మనసులో గూడు కట్టుకుంటున్న అసంతృప్తి తాలూకు వివరాలతో ఏపీఏ 'సైకాలజీ ఆఫ్ వయలెన్స్'జర్నల్ 'హింస్మాతక పిడివాదం 'పేరిట ప్రత్యేక సంచికను వెలువర్చింది. గ్రీస్‌లోని క్రెటే విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ అలెక్సియోస్ అర్వాంటిస్ సారథ్యంలో ఈ పరిశోధన జరిగింది.

### ఎన్నింటికో దారి తీస్తున్న మానసిక అలసట

పనిప్రదేశంలో విపరీతమైన ఒత్తిడి కారణంగా మానసిక అలసట పెరిగిపోయి చివరకు భ యం, బాధ, అసంతృప్తి, అసహనం కట్టలు తెంచుకుంటున్నాయి. తమకు అన్యాయం జరి గిపోతోందనే భావన యువతలో పెరిగిపోతోంది. దీంతో అన్యాయానికి హింసతోనే ముగింపు పలకాలనే ధోరణి ఎక్కువవుతోంది. అధ్యయనంలో భాగంగా పరిశోధకులు వందలాది మంది యువ ఉద్యోగుల రోజువారీ మానసిక స్థితిని అంచనావేశారు. మానసిక అలసట, మానసిక స్థితి, హింసాత్మక ఆలోచన స్థాయిలను క్రోడీకరించారు. అతిగా మానసికంగా అలసిపోయినప్పుడు తీవ్రస్థాయి ఆలోచనలు మంచివేనన్న భావన వారిలో పెరిగిపోతోంది. అన్యాయాన్ని అంతమొందించాలంటే హింసే అత్యుత్తమ మార్గమని వాళ్లు భావిస్తున్నారు. ప్రతిరోజూ ఇలాగే మానసిక అలసటకు గురైతే ఆ స్థాయిలో వారిలో బాధ ఎక్కువవుతోంది. వీటిని మూడురకాల సిద్ధాంతాలతో వర్గీకరించవచ్చని మానసిక నిపుణులు చెబుతున్నారు.

### సాధారణ బాధ సైతం...

సాధారణ బడలిక సిద్ధాంతం ప్రకారం ప్రతిరోజూ అతిపనితో విసిగిపోయిన సందర్భాల్లో ప్రతికూల ఆలోచనలు వెల్లువెత్తుతాయి. ఇక రెండోసిద్ధాంతం ప్రకారం.. చేస్తున్న పనిలో సంతృప్తిలోపించినప్పుడు సైతం మానసిక అలసట, విసుగు పెరుగుతాయి. ఇక మూడో సిద్ధాంతం ప్రకారం తాము ఎంతగా కష్టపడుతున్నా సరైన ప్రాధాన్యత, ఉన్నతాధికారుల నుంచి ప్రశంస దక్కని సందర్భాల్లోనూ మానసి అలసట ఎక్కువై చివరకు హింసాత్మక ఆలోచనలు ఆ యువ ఉద్యోగులను చుట్టుముడుతున్నాయి. ఈ మూడు రకాల సందర్భాల్లోనూ మెజారిటీ యువత తమ వృత్తిలో తమకు సరైన గౌరవం దక్కనప్పుడు, తమ శ్రమకు తగ్గ ఫలితం లభించనప్పుడు తమకు నచ్చిన మార్గంలో సంతృప్తి సాధించేందుకు హింసాత్మక ఆలోచనలకు జై కొడుతున్నారని సర్వేలో తేలింది.

### వ్యవస్థీకృత మార్పుతో..

ఈ పెడపోకడలపై బహుళజాతి అంతర్జాతీయ సంస్థలు తక్షణం మేల్కొనాలి. సంస్థ అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కష్టపడుతున్న ఉద్యోగులకు తగు ప్రాధాన్యతనిస్తే తోటి ఉద్యోగుల్లో సైతం సంస్థ పట్ల గౌరవం, వారిలో అంకితభావం అనూహ్యంగా పెరుగుతాయి. అప్పుడు ఇలాంటి హింసాత్మక ఆలోచనల వైపు యువత అస్సలు మళ్లదు. అప్పుడు మానసిక అలసట అనే ఊసే ఉండదు. పనిచేసే చోట పారదర్శకత కనిపించేలా చేయడం సంస్థల విద్యుక్తధర్మం. తాము ఎంతగా సంస్థ కోసం కష్టపడినా గౌరవం దక్కట్లేదని భావించే వారిని మేనేజర్లు వీలైనంత త్వరగా గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపడితే మొత్తం సంస్థలోనే ప్రతికూలవాతావరణం అనేది మటుమాయం అవుతుంది. ఆ మేరకు ఉన్నతాధికారులు, మేనేజర్లకు సైతం శిక్షణనివ్వాలి. కేవలం సంస్థలో ఉన్నప్పుడు ఉద్యోగి పడే ఆవేదనగా దీనిని తేలిగ్గా తీసుకుంటే మొత్తం సమాజంపైనే ఇది చాన్నాళ్ల తర్వాత ప్రతికూల ప్రభావం చూపుతుంది. సంస్థల దురాశపై ధ్వజమెత్తాలనే పెడపోకడలు ఎక్కువై విప్లవవాదం మరింతగా సమాజంలో వేళ్లూనుకుంటుంది. మానసిక అలసటకు గురైన ఉద్యోగి తమ సంస్థ నుంచే సాంత్వన కోరుకుంటాడు. అక్కడి అది దక్కని నాడు సంస్థ మాత్రమే కాదు సమాజం సైతం దాని దుష్ప్రభావాలను ఎదుర్కోక తప్పదని మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు.

### హింసాత్మకం.. సాధారణం

తమ పరిశోధనపై వైద్యనిపుణులు మరో స్పష్టతనిచ్చారు. "యువతలో మానసిక అలసటకు గురైన ప్రతి ఒక్కరూ ఇలా హింసాత్మక మార్గంలో పయనిస్తున్నారని మేం చెప్పట్లేదు. కానీ ఆ దిశగా అడుగులేసే అవకాశాలు బాగా పెరుగుతున్నాయనేది సుస్పష్టం. ఇది చివరకు హింసాత్మకంగా వ్యవహరించం తప్పు కాదు అనే స్థాయికి యువత ఆలోచన ధోరణి నెమ్మది నెమ్మదిగా మారుతోంది. ఇది అత్యంత ఆందోళనకరం"అని నిపుణులు ఆవేదన వ్యక్తంచేశారు. "నేడు ప్రతి నలుగురిలో ముగ్గురు అతి పనిఒత్తిడి బారిన పడుతున్నారు. దీంతో శ్రామికలోకంలో మెజారిటీ యువత తమకు తెలీకుండానే అతివాదానికి మద్దతుపలుకుతోంది. అధిక పనిఒత్తిడి కారణంగా మానసికఅలసటకు గురైన వారిలో చాలా మందిలో అసహనం పెరిగిపోతోంది. దీంతో విధ్వంసకర ఆలోచనలు మొగ్గ తొడుగుతున్నాయి. ఇవి ప్రజాస్వామ్యయువత విలువలు, చక్కటి, సుహృద్భావ పనివాతావరణానికి గొడ్డలిపెట్టుగా మారుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చూస్తే పనిఒత్తిడి కారణంగా హింసాత్మక ఘటనలు చాలా అత్యల్పస్థాయిలో ఉన్నప్పటికీ వాటి దుష్ప్రభావాలు మాత్రం స్థిరంగా పెరుగుతూ పోతున్నాయి"అని మనోవిజ్ఞాన శాస్త్ర నిపుణులు అభిప్రాయపడ్డారు.

## ఆ ఓటర్లలో 98శాతం మంది పత్రాలు అందాయి

ఇంటర్నెట్‌డెస్క్: బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) సందర్భంగా కొత్తగా నమోదు చేసుకున్నవారిలో 98.2 శాతం మంది నుంచి ధ్రువీకరణ పత్రాలు ఇప్పటికే అందాయని ఎన్నికల కమిషన్ ఆదివారం వెల్లడించింది. తాజాగా పబ్లిష్ చేసిన ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తెలియజేసేందుకు మరో ఎనిమిది రోజుల గడువు ఉంది. ముసాయిదా జాబితాలో తప్పుగా నమోదైన వివరాలను సరిచేయించుకోవడానికి ఓటర్లకు ఇదే చివరి అవకాశమని ఈసీ వెల్లడించింది. ఓటర్లు ఎన్యుమరేషన్ ఫామ్స్ ఇచ్చిన సమయంలో సమర్పించని పత్రాలను ఇప్పుడు సబ్మిట్ చేయవచ్చని వెల్లడించింది. "బిహార్ సీఈవో ఇచ్చిన సమాచారం ప్రకారం ఇప్పటి వరకు 98.2 మంది పత్రాలు అందాయి" అని ఈసీ పేర్కొంది. జూన్ 24 నుంచి ఆగస్టు 24లోపు ఇవి ఈసీకి చేరాయి. సగటున రోజుకు 1.64శాతం మంది సమర్పించినట్లైంది. సెప్టెంబర్ 1వ తేదీ వరకు సమయం ఉందని వెల్లడించింది.

## ఓట్ల చోరీ జరగనీయం.. ఈసీని వదలం

అరారియా: బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు సంబంధించి భారత ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీ పై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అదివారంనాడు విమర్శల దాడి కొనసాగించారు. విపక్ష పార్టీలకు వ్యతిరేకంగా ఈసీఐ, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. బిహార్‌లోని ఆరారియాలో రాష్ట్రీయ జనతా దళ్ నేత తేజస్వి యాదవ్‌తో కలిసి మీడియా సంయుక్త సమావేశంలో రాహుల్ మాట్లాడారు. బీహార్‌లో ఓట్ల చోరీ జరగనీయమని అన్నారు. సరైన ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'ఎన్నికల కమిషన్ ప్రవర్తనను మార్చడం కోసమే మేము ఒత్తిడి చేస్తున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. బిహార్ ఎన్నికల్లో ఓట్ల చోరీని జరగనీయం. మీరు మహారాష్ట్రలో దొంగిలించారు. హర్యానాలో ఓట్ల చోరీ చేశారు. కర్ణాటకలో ఓట్ల చోరీ జరిగినట్టు చాలా స్పష్టంగా చూపించాం. ఇక్కడ ఎంతమాత్రం ఓట్ల చోరీ జరగనీయం' అని రాహుల్ స్పష్టం చేశారు. ఓట్ల చోరీ ఆరోపణలపై తామడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంలో ఈసీ విఫలమైందని రాహుల్ అన్నారు. ఎన్నికల సంఘం తటస్థంగా లేదని, ఈసీఐ, ఎన్నికల కమిషనర్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ అఫిడిట్ సమర్పించకుంటే ఆరోపణలు నిరాధారమని భావించాల్సి వచ్చిందని ఈసీ చెబుతోందని, అనురాగ్ ఠాకూర్ ఇదే తరహా ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహించినప్పటికీ ఆయనను అఫిడవిట్ సమర్పించమని అడగలేదని ఆయన పేర్కొన్నారు. మహాఘట్‌బంధన్ పోల్ మేనిఫెస్టోపై అడిగినప్పుడు, రైతులకు సంబంధించి చాలా ఐడియాలు ఉన్నాయని, రైతు ప్రయోజనాల పరిరక్షణకు మేనిఫెస్టో కమిటీ కసరత్తు చేస్తోందని చెప్పారు.

## చట్టసభలు.. ప్రజా సమస్యలపై చర్చించడానికే గానీ.. రాజకీయ లబ్ధికి కాదు

**ఢిల్లీ:** చట్ట సభలు.. ప్రజాసమస్యలపై చర్చలు జరపడానికే గానీ.. రాజకీయ లబ్ధి పొందేలా వ్యవహరించడానికి కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. దిల్లీలో జరుగుతున్న 'ఆల్ ఇండియా స్పీకర్స్ సమావేశం'లో కేంద్రమంత్రి పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్‌లో జరిగే చర్చలు దేశాభివృద్ధిని ప్రభావితం చేస్తాయని చెప్పారు. "చర్చలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాలు విపక్షాల కారణంగా సజావుగా జరగలేదు. ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. దీని గురించి ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆలోచించాలి. అర్థవంతమైన చర్చలు జరగాలి. సభా గౌరవాన్ని, స్పీకర్ పదవి గౌరవాన్ని పెంపొందించడానికి కృషి చేయాలి. ప్రజాసమస్యలపై నిష్పాక్షపాతమైన చర్చలు జరపడానికి చట్ట సభలను వేదికగా మార్చుకోవాలి. వాటి నిబంధనల మేరకు సమావేశాలు జరిగేలా చూడాలి"అని అన్నారు. సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి తొలి భారతీయ స్పీకర్‌గా పనిచేసిన విఠల్‌భాయ్ పటేల్‌కు కేంద్రమంత్రి అమిత్ షా నివాళులర్పించారు. వందేళ్ల క్రితం స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికతోనే దేశంలో పార్లమెంటరీ చరిత్ర మొదలైందన్నారు. అప్పటి బ్రిటిష్ పాలనలో 1919 డిసెంబర్ 24న దేశంలో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఏర్పాటైంది. 1925లో విఠల్‌భాయ్ పటేల్ ఈ సభకు స్పీకర్‌గా ఎన్నికయ్యారు.

## ఓటర్ లిస్టులో ఇద్దరు పాక్ మహిళలు.. దర్యాప్తు షురూ



**పట్నా:** బీహార్ ఓటర్ల లిస్టులో వింత వైనాలు వెలుగు చూస్తున్నాయి. 1950లలో భారత్‌లోకి ప్రవేశించిన ఇద్దరు పాకిస్తానీ మహిళలు బీహార్‌లో ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు వెల్లడయ్యింది. దీనిపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దర్యాప్తు ప్రారంభించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం హోం మంత్రిత్వ శాఖ ఇటీవల వీసా గడువు ముగిసిన తర్వాత కూడా దేశంలోనే ఉండిపోయిన విదేశీయుల రికార్డులను తనిఖీ చేస్తున్నప్పుడు ఈ ఉదంతం వెలుగు చూసింది. భాగల్పూర్‌కు చెందిన ఇద్దరు మహిళలు విదేశీ పౌరులుగా ఓటర్ల సవరణలో తేలారని అధికారులు నిర్ధారించారు. ఓటర్ల ధృవీకరణ నిర్వహించిన బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ)మాట్లాడుతూ ఆ మహిళలకు సరిపోయే పాస్‌పోర్ట్ వివరాలతో కూడిన అధికారిక సమాచారం అందిందన్నారు. వారిలో ఒకరి పేరు ఇమ్రానా ఖానం. ఆమె వృద్ధురాలు. అనారోగ్యంతో ఉన్నందున మాట్లాడే స్థితిలో లేదు. ఆమె పాస్‌పోర్ట్ 1956 నాటిది. ఇంకొక మహిళ కూడా ఇలానే భారత్‌లో ఉంటున్నారు. శాఖాపరమైన సూచనలను అనుసరించి వారి పేర్లను తొలగించే ప్రక్రియను ప్రారంభించామని సంబంధిత అధికారులు తెలిపారు. కాగా ఈ పాక్ మహిళల ఉదంతం అధికారిక విచారణలో ఉంది. ఉన్నతాధిధికారులు వీరిపై తదుపరి చర్యలు తీసుకోవాల్సివుంది. దీనిపై ఆగస్టు 11న హోం మంత్రిత్వ శాఖ నుండి నోటీసు స్థానిక ఎన్నికల కార్యాలయానికి చేరుకుంది. తక్షణం వారిపై చర్యలు చేపట్టాలని దానిలో కోరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిర్వహించిన ఓటరు కార్డుల సవరణ వివాదానికి దారితీసింది. ప్రతిపక్ష పార్టీలు ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని, ఇవి జరుగుతున్నాయని ఆరోపించాయి. అయితే నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా చూడాల్సిన బాధ్యతతోన ఈ సవరణ చేపట్టామని సంబంధిత అధికారులు తెలిపారు.

## రాహుల్ ఓటర్ అధికార్ యాత్రలో జోష్



**పూర్ణియా:** బిహార్‌లో రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర' కొనసాగుతోంది. కాంగ్రెస్ కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతూ రాహుల్ సోదరి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఈ యాత్రలో పాల్గోనున్నారు. సుపౌల్ సీతమర్హి లో ఈనెల 26, 27 తేదీల్లో రాహుల్‌తో ప్రియాంక కలిసి పాల్గొంటారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్ తెలిపారు. బిహార్‌లో హిందువులు ముఖ్యమైన పండుగగా భావించే హర్తాలికా తీజ్ కూడా ఈనెల 26న జరుగనుంది. వివాహిత స్త్రీలు ఈ పండుగలో భర్త దీర్ఘాయుష్షు, సౌభాగ్యం కోసం రోజంతా ఉపవాస వ్రతం పాటిస్తారు. ప్రియంక గాంధీ తన పర్యటనలో భాగంగా సీతామర్హిలోని జానకిమాత ఆలయంలో పూజల్లో పాల్గొంటారు. రాహుల్ యాత్రలో ప్రియాంక పాల్గొనడం ద్వారా ఓట్ల చోరీకి వ్యతిరేకంగా జరుగుతున్న యాత్రలో మహిళల మద్దతు కూడా కూడగడతారని కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు తెలిపారు. కాగా, రాహుల్ గాంధీ ఆదివారంనాడు పూర్ణియా జిల్లాలో యాత్ర సాగించారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్‌పై రెండు కిలోమీటర్లు యాత్ర సాగించారు. మార్గమధ్యలో జాలాగఢ్ సమీపంలోని రోడ్డుపక్కనే ఉన్న ధాబా వద్ద రాహల్ ఆగి టీ తాగుతూ స్థానికులతో ముచ్చటించారు. బిహార్‌లో అక్టోబర్-నవంబర్ మాసాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల కమిషన్ బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టడం, సవరించిన ఓటర్ల జాబితాను ప్రకటించడంపై విపక్షాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. లక్షలాది ఓటర్లను జాబితా నుంచి తొలగించారని, పెద్ద సంఖ్యలో నకిలీ ఓటర్లను చేర్చారని, తద్వారా బీజేపీతో కలిసి ఓట్ల చోరీకి ఈసీ పాల్పడుతోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు ఆధారాలుంటే రాహుల్ అఫిడవిట్ సమర్పించాలని, అలా చేయకుంటే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఈసీ డిమాండ్ చేసింది. అయితే రాహుల్ తన వాదనకే కట్టుబడుతూ బిహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' కొనసాగిస్తున్నారు.

## బీజేపీ-రాహుల్‌గాంధీ నాటకాన్ని నమ్మొద్దు



బీహార్ ఓటర్లను ప్రతిపక్ష కాంగ్రెస్, అధికార బీజేపీ పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఎన్నికల వ్యూహకర్త, జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ విమర్శించారు. ఆ రెండు పార్టీలు ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలను వదిలేసి 'ఓట్ చోరీ' పైనే పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆర్జేడీ సూచనల ప్రకారమే నడుచుకుంటున్నారని, బీహారీల సమస్యలపై మాత్రం ఆయన దృష్టి పెట్టడంలేదని ప్రశాంత్ కిషోర్ ఆరోపించారు. ఎన్నికల వేళ రాహుల్ గాంధీని ప్రధాని నరేంద్ర మోదీ, ప్రధాని నరేంద్ర మోదీని రాహుల్ గాంధీ పరస్పరం విమర్శించుకుంటున్నారని ప్రశాంత్ కిషోర్ చెప్పారు. అదంతా ఆ రెండు పార్టీలు ఆడుతున్న నాటకమని, ఆ నాటకం ఉచ్చులో మీరు పడొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. పేదరికం, నిరుద్యోగం, వలసలు, సరైన విద్యా సౌకర్యాలు లేకపోవడం లాంటివి బీహార్‌లో అసలైన సమస్యలని, ప్రధాన పార్టీలు ఈ సమస్యలను గాలికి వదిలేశాయని ప్రశాంత్ కిశోర్ విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా తాను 'జన్ సూరజ్ పార్టీ' ని స్థాపించానని చెప్పారు.

# క్రికెట్‌కు వీడ్కోలుకు పలికిన ఛెతేశ్వర్ పుజారా

భారత క్రికెట్‌కు 'నయా వాల్'గా పేరు గాంచిన సీనియర్ టెస్ట్ ప్లేయర్ ఛెతేశ్వర్ పుజారా అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్‌ను ప్రకటించాడు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. 2023లో ఆస్ట్రేలియా పర్యటనలో జట్టు నుంచి చోటు కోల్పోయిన తర్వాత పుజారా గత కొన్నాళ్లుగా ఫామ్ లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. దీంతో అతను తిరిగి జట్టులోకి రావడం కష్టంగా మారింది. దేశవాళీ క్రికెట్‌లో మంచి ప్రదర్శనలు చేసినప్పటికీ, సెలెక్టర్ల నుంచి పిలుపు రాలేదు. దీంతో ఇకపై తనకు జట్టులో చోటు దక్కడం కష్టమని భావించిన అతడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక పుజారా నిర్ణయాన్ని పలువురు క్రికెటర్‌లు స్వాగతిస్తున్నారు.కెరీర్ పరంగా చూసుకుంటే.. పుజారా 103 టెస్ట్ మ్యాచ్‌లు ఆడగా.. 43.60 సగటుతో మొత్తం 7,195 పరుగులు చేశారు. ఇందులో 19 సెంచరీలు మరియు 35 అర్ధ సెంచరీలు ఉన్నాయి. 2018-19లో ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో పుజారా అద్భుతమైన ప్రదర్శన కనబరిచి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు గెలుచుకున్నారు. ఆ సిరీస్‌లో మొత్తం 521 పరుగులు చేసి, భారతదేశం తొలిసారిగా ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్‌ను గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించారు. అయితే టెస్ట్‌లలో రాణించిన పుజారా వన్డేలలో రాణించలేక పోయాడు. తన క్రికెట్ కెరీర్‌లో కేవలం 5 వన్డేలు మాత్రమే ఆడారు. క్రీజులో ఎక్కువ సేపు నిలబడి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించే



పుజారాని చూసి రాహుల్ ద్రవిడ్ తర్వాత, పుజారాను 'నయా వాల్' అని పిలిచేవారు.

# ఉత్తుత్తి మాటలే కేంద్ర ప్రభుత్వ పన్ను సంస్కరణలతో ప్రయోజనం అంతంతే

న్యూఢిల్లీ, : దేశానికి, దేశ ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చేందుకే ఈ సంస్కరణలంటూ ఊదరగొడుతూ వస్తున్న మోదీ సర్కారు.. గడిచిన 11 ఏండ్లలో తీసుకున్న ఏ నిర్ణయంతోనూ ఎవరికీ పెద్దగా ఒనగూరిన లాభమేమీ లేకపోవడం గమనార్హం. ముఖ్యంగా పన్నుల విషయానికొస్తే.. కార్పొరేషన్, వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ)ల్లో కోతలు పెట్టినా.. సంపద పన్ను రద్దు చేసినా ఫలితం శూన్యమేనన్న అభిప్రాయాలున్నా యి. ఎల్‌టీసీజీ, కొత్త ఐటీ చట్టానిదీ ఇంతే.ఇదీ సంగతి.అన్నింటా తన వారికి, తన రాష్ట్రానికి పెద్దపీట వేయడం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకే చెల్లిందని చెప్పవచ్చు. గతంలో జరిగిన తన సౌదీ అరేబియా పర్యటనలో స్వరాష్ట్రం గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో ఆ దేశ సావరిన్ ఫండ్ పీఐఎఫ్ కార్యాలయం పెట్టేందుకు వీలుగా చట్టాన్నైతే సవరించేశారు మరి. డివిడెండ్, వడ్డీ, దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్నుల నుంచి పీఐఎఫ్‌కు మినహాయింపు కల్పించడం విశేషం.




వినియోగం, సేవింగ్స్ పెరిగాయాకేంద్రంలో మోదీ సర్కారు అధికారంలోకి వచ్చిన 2014-15 నుంచి 2024-25 వరకు ఈ పదేండ్లలో దేశ జీడీపీ కంటే డిమాండ్‌లో వాస్తవిక వృద్ధిరేటు సగటు తక్కువగానే ఉంటున్నది. జీడీపీ 6.2 శాతంగా ఉంటే.. వినియోగం వృద్ధి 6.1 శాతంగానే ఉన్నది. తయారీ రంగానిదీ ఇంతే. ఇక పొదుపు విషయానికొస్తే.

# వరల్డ్ కప్ లక్ష్యంగా వైజాగ్ క్యాంప్ భారత 'ఏ' జట్టుతో రెండు డే-నైట్ మ్యాచ్‌లు

సొంతగడ్డపై జరుగబోయే వన్డే వరల్డ్ కప్‌లో భారత మహిళల జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. స్థానిక పరిస్థితులను సొమ్ము చేసుకొని ఛాంపియన్లుగా నిలవాలని హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం గట్టిగానే అనుకుంటోంది. అనుకోవడమే కాదు.. ఈ మెగా టోర్నీ సన్నద్ధతను మరో రెండు రోజుల్లో ప్రారంభించనుంది. హర్మన్‌ప్రీత్ నేతృత్వంలో స్క్వాడ్‌లోని సభ్యులు విశాఖపట్టణంలోని శిక్షణ శిబిరంలో రాటుదేలనున్నారు. ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ముందు వారం రోజుల పాటు జరిగే ఈ ట్రైనింగ్ క్యాంప్‌లో తమ మెలకువలకు మెరుగులు దిద్దుకోనున్నారు.వరల్డ్ కప్‌లో వైజాగ్ వేదికగా టీమిండియా రెండు కీలక మ్యాచ్‌లు ఆడనుంది. వీటిలో ఒకటి దక్షిణాఫ్రికాతో అక్టోబర్ 9న, రెండోది ఆస్ట్రేలియాతో అక్టోబర్ 12న. లీగ్ దశలో ఈ రెండింటా విజయం సాధిస్తే భారత్ ముందంజ వేసే అవకాశముంది. అందుకే వైజాగ్ స్టేడియం పిచ్, వాతావరణం మీద అవగాహనకు ఈ



శిక్షణ శిబిరం ఉపయోగపడుతుంది. అయితే.. వరల్డ్ కప్ స్క్వాడ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, ఆల్‌రౌండర్ స్నేహ్ రానా.. ఈ ముగ్గురికి మాత్రమే గతంలో (2014లో) ఈ మైదానంలో ఆడిన అనుభవం ఉంది. కాబట్టి.. మిగతావాళ్లకు ఇక్కడి పరిస్థితులు అర్థమయ్యేలా వారం రోజులు ఈ ట్రైనింగ్ క్యాంప్ నిర్వహిస్తోంది బీసీసీఐ.

# డీమార్ట్ బంపర్ పండుగ ఆఫర్స్

పండుగలు వస్తున్నాయంటే చాలు, షాపింగ్ మాల్స్‌లో ఆఫర్ల హెూరు మొదలవుతుంది. ఈసారి వినాయక చవితిని పురస్కరించుకుని డీమార్ట్ వినియోగదారులకు బంపర్ ఆఫర్లు అందిస్తోంది. కేవలం సగం ధరకే అనేక ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకొచ్చింది. మరి ఈ పండుగ సీజన్‌లో ఏయే ఉత్పత్తులపై ఎలాంటి డిస్కౌంట్లు ఉన్నాయో చూద్దాం.సగం ధరకే గ్రాసరీ స్, పప్పులువంటగదికి కావాల్సిన నిత్యావసరాలపై భారీ డిస్కౌంట్లు ఉన్నాయి. ఆర్గానిక్ కందిపప్పు (1 కేజీ) అసలు ధర రూ. 365 కాగా.. డీమార్ట్‌లో రూ. 182కే కొనుగోలు చేయవచ్చు. అదేవిధంగా సఫోలా మీల్ మేకర్ రూ. 150 నుంచి రూ. 75కి, ఎపిస్ క్లాసిక్ సీడెడ్ ఖర్జూరాలు (అర కేజీ) రూ. 199 నుంచి రూ. 99కి తగ్గాయి. ఈస్ట్రన్ కారం పొడి (అర కేజీ) కూడా రూ. 200 నుంచి రూ. 100కే లభిస్తోంది. పప్పులు, మసాలాలు వంటివి సగం ధరకే అందుబాటులో ఉండటం గమనార్హం.చాక్లెట్స్, బిస్కెట్స్‌పై భారీ ఆఫర్స్పిల్లల కోసం చాక్లెట్లు, బిస్కెట్లు కొనేందుకు ఇదే సరైన సమయం. సన్ ఫీస్ట్ డార్క్ ఫ్యాంటసీ యమ్మీఫిల్ పై ప్యాకెట్ రూ. 180 నుంచి కేవలం రూ. 83కే లభిస్తోంది. బ్రిటానియా గుడ్‌డే చోకోచిప్స్ (400 గ్రాములు) ప్యాకెట్ రూ. 150 నుంచి రూ. 75కి, కరాచీ చాయ్ బిస్కెట్ (400 గ్రాములు) రూ. 180 నుంచి రూ. 90కి తగ్గాయి. సువ నారు 100 రకాల బిస్కెట్లు, చాక్లెట్లు ఇలాగే సగం ధరకే లభిస్తున్నాయి.తక్కువ ధరలో.ఈ నెల డీమార్ట్‌లో అత్యధికంగా అమ్ముడవుతున్న వాటిలో కొన్ని ఉత్పత్తులు సగం ధరకే లభిస్తున్నాయి. ఉదాహరణకు.. రూ. 120 విలువైన బ్రిటానియా జిమ్ జామ్ పాప్స్ కుకీస్ రూ. 60కే, అలాగే రూ. 460 ఉండే బ్రిటానియా చీజ్ స్లైసెస్ రూ. 230కే లభిస్తు న్నాయి. ఇంటి




శుభ్రతకు వాడే సాని ఫ్రెష్ టాయిలెట్ క్లీనర్ రూ. 225కి బదులు రూ. 112కే అందుబాటులో ఉంది. ఆరోగ్యకరమైన ఆహారం కోసం చూసేవారికి.. రూ. 320 విలువైన యోగా బార్ మిల్లెట్ మ్యూస్లీ నట్స్ రూ. 160కి, బికాజీ చౌపతీ బేల్‌పురి (110 గ్రాములు) రూ. 49కి బదులు రూ. 24కే లభిస్తున్నాయి.కిచెన్ అప్లియాన్సెస్‌పై..కిచెన్‌కు అవసరమైన పెద్ద వస్తువులపైనా భారీ డిస్కౌంట్లు ఉన్నాయి. బటర్‌ఫ్లై స్టెయిన్‌లెస్ స్టీల్ కుక్కర్ (5.5 లీటర్లు) అసలు ధర రూ. 4,851 కాగా, ఇప్పుడు కేవలం రూ. 1,949కే లభిస్తోంది, అంటే రూ. 2,902 ఆదా చేసుకోవచ్చు. పిజియన్ హార్డ్ ఆనోడైజ్డ్ ప్రెషర్ కుక్కర్ (3 లీటర్లు) రూ. 3,445 నుంచి రూ. 1,699కి తగ్గింది. అంతేకాకుండా పర్సనల్ కేర్ ఉత్పత్తులైన చందన్ స్పర్శ సోప్ (150 గ్రా. 4 ప్యాక్) రూ. 220 నుంచి రూ. 110కి, లైఫ్‌బాయ్ లెమన్ అలో ఫ్రెష్ సోపులు (125 గ్రా. 7 ప్యాక్) రూ. 370 నుంచి రూ. 185కి లభిస్తున్నాయి. సంతూర్ ప్యూర్ గ్లో బాతింగ్ బార్ (125 గ్రా. 4 ప్యాక్) రూ. 405కి బదులు రూ. 202కే అందుబాటులో ఉన్నాయి. ఇంకా గ్రేస్, వివెల్, ఖాదీ వంటి బ్రాండ్ల ఉత్పత్తులు కూడా సగం ధరకే లభిస్తున్నాయి.మొత్తంగా ఈ వారం డీమార్ట్‌లో గ్రాసరీలు, కిచెన్ అప్లియాన్సెస్, పర్సనల్ కేర్ ఉత్పత్తులు, ఫర్నిచర్, డెకార్ వంటి దాదాపు అన్ని రకాల వస్తువులపై 50శాతానికి పైగా డిస్కౌంట్లు లభిస్తున్నాయి. కొన్ని ఉత్పత్తులపై 60-70శాతం వరకు డిస్కౌంట్ కూడా ఉంది. ఇది నెలాఖరు, పైగా పండుగ సమయం కావడంతో స్టాక్‌ను క్లియర్ చేయడానికి డీమార్ట్ ఈ భారీ ఆఫర్లను ప్రకటించిందని తెలుస్తోంది. కాబట్టి ఈ వారంలో షాపింగ్ చేయాలనుకునేవారు ఈ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవచ్చు..

# యూఎస్ యుద్ధం నుంచి గ్రాండ్‌స్లామ్ టోర్నీ

టైటిల్ ఫేవరేట్లుగా అల్కరాజ్, సిన్నర్


సీజన్ ఆఖరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ యుద్ధానికి సమయం ఆసన్నమైంది. ఆదివారం నుంచి న్యూయార్క్‌లోని బిల్లీజీన్ నేషనల్ స్టేడియంలో యూఎస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకి తెరలేవనుంది. గతానికి భిన్నంగా ఈసారి మిక్స్‌డ్ డబుల్స్ ద్వారా టోర్నీకి కొత్త కల రాగా, టైటిల్ వేట కోసం స్పెయిన్ నయా బుల్ కార్లోస్ అల్కరాజ్, ఇటలీ యువ సంచలనం జానిక్ సిన్నర్ సై అంటే సై అంటున్నారు. కోర్టులో కొదమ సింహాల్లా తలపడే ఈ ఇద్దరి మధ్య పోరు అభిమానులను మునివేళ్లపై నిలబెట్టడం ఖాయంగా కనిపిస్తున్నది. ప్రపంచ టాప్-2 ప్లేయర్లుగా కొనసాగుతున్న సిన్నర్, అల్కరాజ్ మరోమారు యూఎస్ ఓపెన్ టైటిల్‌పై కన్నేశారు. ఇటీవలే వింబుల్డన్ గెలిచి సిన్నర్ మంచి జోరు మీదుంటే తానేం తక్కువ కాదంటూ అల్కరాజ్ సంకేతాలు పంపుతున్నాడు.యూఎస్ ఓపెన్‌కు సన్నాహకంగా జరిగిన సిన్సినాటీ టోర్నీలో అల్కరాజ్‌ను టైటిల్ వరించగా, తుదిపోరులో సిన్నర్ అనారోగ్యంతో అర్ధాంతరంగా వైదొలిగాడు. సిన్నర్, అల్కరాజ్ చివరి ఏడు గ్రాండ్‌స్లామ్ టోర్నీ టైటిళ్లను పంచుకున్నారంటే వారి మధ్య పోటీ ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవలి ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ పోరు అభిమానులకు



పసందైన విందు అందించింది. సిన్నర్ గెలుస్తాడనుకున్న టైటిల్‌ను కడదాకా పోరాడి టైబ్రేక్‌లో సొంతం చేసుకున్న అల్కరాజ్ అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు. ఐదున్నర గంటల పాటు సుదీర్ఘంగా సాగిన తుది సమరం సుదీర్ఘమైన ఫ్రెంచ్ ఓపెన్ చరిత్రలో ఒక మరుపురాని మ్యాచ్‌గా నిలిచిపోయింది.చిక్కినట్లే చిక్కి చేజారిన ఫ్రెంచ్ ఓపెన్ ఓటమికి ప్రతీకారాన్ని సిన్నర్ వింబుల్డన్‌లో తీర్చుకున్నాడు. పచ్చని పచ్చికపై స్పెయిన్ బుల్ అల్కరాజ్‌కు కళ్లెం వేస్తూ వింబుల్డన్ ట్రోఫీని ముద్దాడాడు. చివరి గ్రాండ్‌స్లామ్ అయిన యూఎస్ ఓపెన్ టైటిల్ ఈ ఇద్దరిలో ఎవరికి దక్కుతుంది అనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు దిగ్గజ ప్లేయర్ నోవాక్ జొకోవిచ్ రికార్డు స్థాయిలో 25వ టైటిల్‌పై కన్నేశాడు. ఎలాగైనా టైటిల్ కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో ఉన్న ఈ సెర్బియా యోధుడికి కొత్త కుర్రాళ్లు సిన్నర్, అల్కరాజ్ నుంచి ప్రమాదం పొంచి ఉంది. మరోవైపు మహిళల సింగిల్స్‌లో అరీనా సబలెంకా, ఇగా స్వియాటెక్, కొకో గాఫ్ టైటిల్‌ను ఒడిసిపట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

# బంపర్ ఆఫర్ అంటే ఇదీ అతి తక్కువ ధరకే డైలీ 3 డేటా 84రోజుల వ్యాలిడిటీ

గత కొంత కాలంగా బీఎస్ఎన్ఎల్ మంచి మంచి ఆఫర్లతో కస్టమర్లను అట్రాక్ట్ చేస్తుంది. ఇప్పటికే చాలా మంది బీఎస్ఎన్ఎల్ వైపు మళ్లారు. ఎయిర్ టెల్, జియో కంపెనీలు ఏడాది క్రితం రీఛార్జ్ ధరలు పెంచడంతో చాలా మంది బీఎస్ఎన్ఎల్‌కు పోర్ట్ అయ్యారు. ఇప్పుడు ఈ ప్రభుత్వ సంస్థ ఓ అద్భుతమైన ప్రీపెయిడ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. ఈ ప్లాన్‌లో డేటా, కాలింగ్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దీని వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.84 రోజులు.. 3జీబీ డేటా.బీఎస్ఎన్ఎల్ తన అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఈ కొత్త ప్లాన్ గురించి వెల్లడించింది. ఈ ప్లాన్ 84 రోజుల వ్యాలిడిటీతో అందుబాటులో ఉంది. అన్‌లిమిటెడ్ కాల్స్, ప్రతి రోజూ 3జీబీ హై-స్పీడ్ డేటా లభిస్తుంది. దీంతో పాటు ఈ ప్లాన్‌లో రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు వస్తాయి. అయితే ఈ ప్లాన్ ధర కేవలం రూ.599 మాత్రమేనని బీఎస్ఎన్ఎల్ వెల్లడించింది. ఇంత తక్కువ ధరతో ఇతర ఏ నెట్‌వర్క్ ఇటువంటి ప్లాన్ అందించడం లేదు.రూ.1కే సిమ్.. డేటా, కాలింగ్‌ఈ అద్భుతమైన ప్లాన్‌తో పాటు బీఎస్




ఎన్ఎల్ మరో బంపర్ ఆఫర్‌ను కూడా కొనసాగిస్తోంది. కొంతకాలం క్రితం కంపెనీ ప్రకటించిన ఫ్రీడమ్ ఆఫర్ కింద వినియోగదారులు కేవలం రూ.1కే బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డును పొందవచ్చు. సిమ్ కార్డ్ మాత్రమే కాదు, ఈ ఆఫర్‌తో 30 రోజుల వ్యాలిడిటీతో రోజుకు 2జీబీ డేటా, ఏ నెట్‌వర్క్‌కైనా అన్‌లిమిటెడ్ కాల్స్ సౌకర్యం కూడా లభిస్తుంది. అయితే ఈ ఆఫర్ ఆగస్టు 31 వరకు మాత్రమే చెల్లుతుంది. ప్రైవేట్ టెలికాం కంపెనీలకు గట్టి పోటీ ఇచ్చేందుకు బీఎస్ఎన్ఎల్ ఇలాంటి ఆకర్షణీయమైన ప్లాన్‌లతో ముందుకు వస్తోంది.

# కేరళలో అర్జెంటీనా మ్యాచ్

కొచ్చి: భారత ఫుట్‌బాల్ అభిమానులకు శుభవార్త! తాము ఎంతగానో ఆరాధించే ఆధునిక ఫుట్‌బాల్ దిగ్గజం, సాకర్ స్టార్ లియోనల్ మెస్సీ నేతృత్వంలోని అర్జెంటీనా..భారత్‌లో మ్యాచ్ ఆడబోతున్నది. ఈ ఏడాది నవంబర్‌లో కేరళలో జరిగే ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్‌లో అర్జెంటీనా టీమ్ బరిలోకి దిగుతున్నది. కొచ్చి లేదా తిరువనంతపురం వేదికగా నవంబర్ 10 నుంచి 18వ తేదీ మధ్యలో జరిగే మ్యాచ్‌లో స్థానిక ఫుట్‌బాల్ టీమ్‌తో అర్జెంటీనా ఆడనుంది.ఈ విషయాన్ని కేరళ క్రీడాశాఖ మంత్రి అబ్దుర్‌రెహమాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. 'లియోనల్ స్కాలోని కెప్టెన్సీలోని అర్జెంటీనా టీమ్ ఈ ఏడాది రెండు ఫిఫా ఫ్రెండ్లీ



మ్యాచ్‌లు ఆడనుంది. అక్టోబర్‌లో అమెరికాలో జరిగే మ్యాచ్‌లో పాటు నవంబర్‌లో భారత్‌లో మరో మ్యాచ్ ఆడుతుంది' అని అర్జెంటీనా ఫుట్‌బాల్ అసోసియేషన్ తమ అధికారిక ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 2022లో జరిగిన ఫిఫా ప్రపంచకప్ టోర్నీలో అర్జెంటీనా విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఫైనల్లో మెస్సీసేన..ఫ్రాన్స్‌పై చిరస్మరణీయ విజయం సాధించింది

# స్థిరంగా బంగారం ధరలు

ఆగస్టు 24 ఆదివారం రోజున 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,01,620 గా ఉంది. అదే విధంగా 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 93,150 గా ఉంది.నేడు ఆగస్టు 24 ఆదివారం రోజున 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,01,620 గా ఉంది. అదే విధంగా 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 93,150 గా ఉంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,01,620 ఉండగా, 22



క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.93,150 వద్ద ఉంది. విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,01,620 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.93,150 వద్ద ఉంది.హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,01,620 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.93,150 వద్ద ఉంది. విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,01,620 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,01,620 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.93,150 వద్ద ఉంది.

# పవన్ కళ్యాణ్ 'ఓజీ'పై భారీ అంచనాలు అప్పుడే అడ్వాన్స్ బుకింగ్స్ కూడా మొదలు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో రూపొందిన హిస్టారికల్ వార్ డ్రామా 'హరిహర వీరమల్లు' ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయినప్పటికీ, ఇప్పుడు ఆయన అభిమానులు 'ఓజీ' సినిమాపై భారీ ఆశలు పెట్టుకున్నారు. ఈ సినిమాకు సంబంధించి ఇటీవల కొన్ని పుకార్లు చక్కర్లు కొట్టినా, చిత్ర బృందం వాటికి చెక్ పెట్టింది. 'ఓజీ' సినిమా ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 25న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో అమెరికాలోని ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ప్రత్యంగిరా సినిమాస్ ప్రకటించిన వివరాల ప్రకారం, ఆగస్టు 29 నుండి అక్కడ అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. ఇక సెప్టెంబర్ 24న ప్రీమియర్ షోలు జరుగనున్నాయి. దీంతో సినిమా విడుదలపై ఎటువంటి జాప్యం లేదని స్పష్టమవుతోంది. అమెరికాలో మాత్రమే కాదు, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోనూ ఈ సిని మాకు భారీ స్థాయిలో బజ్ కనిపిస్తోంది. హరిహర వీరమల్లు ఫలితం ఎలా ఉన్నా, పవన్ కళ్యాణ్‌కి ఉన్న క్రేజ్‌తో పాటు 'ఓజీ' ట్రైలర్లు, పాటలు సినిమాపై అంచనాలను పెంచాయి. సినిమాకు సంగీత దర్శకుడు తమన్ అందించిన ట్యూన్స్ ఇప్పటికే అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా 'నెత్తురుకు మరిగిన హంగ్రీ చీతా' పాటతో మొదలైన హైప్, ఇటీవల విడుదలైన 'ఫైర్ స్ట్రోమ్' పాటతో మరింత పెరిగింది. దర్శకుడు సుజీత్ స్టైలిష్ టేకింగ్, పవన్ పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. గ్యాంగ్‌స్టర్ షేడ్స్ ఉన్న పాత్రలతో పవన్ ఎప్పుడూ హిట్ అందుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు 'ఓజీ'లో ఓజస్ అనే పాత్రలో పవన్ మరోసారి యాక్షన్ మోడ్‌లో కనిపించనున్నాడు. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలే అభిమానుల్ని ఫుల్ ఎగ్జైట్ చేశాయి. ఈ సినిమాను డివివి ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత డీవీవీ దానయ్య,




ఆయన కుమారుడు దాసరి కళ్యాణ్ కలిసి నిర్మిస్తున్నారు. హీరోయిన్‌గా ప్రియాంక మోహన్ నటిస్తుండగా, ప్రకాశ్ రాజ్, శ్రీయా రెడ్డి వంటి కీలక నటులు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. సెప్టెంబర్ 25న 'ఓజీ' థియేటర్లలోకి రాబోతున్న నేపథ్యంలో, ఫ్యాన్స్ సంబరాలు ఇప్పటి నుంచే మొదలయ్యాయి. రీల్‌లోనే కాదు, రియల్‌లోనూ పవర్ స్టార్ పవర్ చూపించబోతున్నారని అభిమానులు విశ్వాసంతో ఎదురుచూస్తున్నారు.

# ఎన్టీఆర్ హృతిక్ రోషన్ 'వార్ 2' డిజాస్టర్‌పై జోరుగా చర్చలు ఆర్జీవీ షాకింగ్ కామెంట్స్

బాలీవుడ్ దిగ్గజ నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై, అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందిన మల్టీస్టారర్ సినిమా 'వార్ 2'. ఈ చిత్రం ఆగస్టు 14న గ్రాండ్‌గా విడుదలైన సంగతి తెలిసిందే. యంగ్ టైగర్ ఎన్టీఆర్ మరియు హృతిక్ రోషన్ కలిసి నటించిన ఈ చిత్రం భారీ అంచనాల నడుమ విడుదలై, అనూహ్యంగా మిక్స్ టాక్ ఎదుర్కొంటూ తీవ్ర విమర్శల పాలైంది. స్పై యాక్షన్ జానర్‌లో రూపొందిన ఈ చిత్రంలో ఎన్టీఆర్ పాత్రను చాలా తక్కువగా చూపించారని, ఆయన క్యారెక్టర్ అంత స్ట్రాంగ్‌గా లేదని ఫ్యాన్స్ అభిప్రాయపడు తున్నారు. "ఇలాంటి కథకు ఎన్టీఆర్ తన టైమ్ వేస్ట్ చేసుకున్నాడు" అంటూ పలువురు అభిమానులు సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ మూవీ తెలుగు వెర్షన్ హక్కులను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అయితే సినిమా డిజాస్టర్ కావడంతో రూ. 40 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. తెలుగులోనే కాదు, హిందీలో కూడా సినిమాకి ఆశించిన స్థాయి ఆదరణ రాకపోవడంతో బాలీవుడ్ ట్రేడ్ వర్గాలు సినిమాపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. భారీ స్టార్ కాస్టింగ్ ఉన్నప్పటికీ, చప్పగా సాగే స్క్రీన్‌ప్లే, అసంబద్ధమైన సన్నివేశాలు ప్రేక్షకులను విసిగించాయన్నది వారి అభిప్రాయం. ఈ



నేపథ్యంలో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ) తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. హృతిక్ రోషన్ ఎంట్రీ సీన్ జపాన్ వాళ్లతో ఫైట్ ఉంటుంది. అసలు జపాన్ మన మిత్ర దేశం. అలాంటి వారితో ఫైట్ ఎందుకు పెట్టారో అర్థం కావడం లేదు. స్పై యూనివర్స్ అంటే శత్రుదేశాలతో పోరాటాలు ఉండాలి. కానీ ఇక్కడ లాజిక్ మిస్ అయింది. సంబంధం లేని విధంగా సన్నివేశాలు రూపొందించారు. ఈ క్రమంలోనే సినిమా కథే చచ్చిపోయింది. అలాగే, హీరోల ఎలివేషన్ కోసం సీన్స్ క్రియేట్ చేయడం వల్లనే సినిమాలు ఫెయిలవుతున్నాయి. దర్శకులు కథ విషయంలో శ్రద్ధ చూపించాలి. హీరోని గొప్పగా చూపించాలనే ప్రయత్నంలో కథని మరుస్తున్నారనే నిజాన్ని గ్రహించాలి" అని విమర్శించారు. ఆర్జీవీ వ్యాఖ్యలపై ఎన్టీఆర్ ఫ్యాన్స్ సైతం స్పందిస్తూ, "ఇది నిజం. మాస్ ఎలివేషన్ కంటే కథ, పాత్ర బలమే ముఖ్యమని చెబుతున్న మాటల్లో నిజం ఉంది" అని వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తంగా 'వార్ 2' ఫలితం.. మూవీ లవర్స్‌ను నిరాశ పరచడమే కాకుండా, ఎన్టీఆర్ తదుపరి బాలీవుడ్ ప్రయాణంపై ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి

# ప్రశ్నల సుడిగుండంలో ఎన్టీఆర్

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశ్నల సుడిగుండంలో చిక్కుకున్నాడు. ఒకటి కాదు రెండు కాదు చాలా రూమర్స్ ఎన్టీఆర్ చుట్టూ తిరుగుతున్నాయి. ఇప్పటివరకు ఎన్టీఆర్ వాటిపై స్పందించింది లేదు. ట్రోల్స్ ను కంట్రోల్ చేసింది లేదు. అసలు ఇప్పటివరకు ఎన్టీఆర్ బయట కనిపించింది కూడా లేదు. ఎన్టీఆర్ విషయంలో అసలేం జరుగుతుంది. ఈ ప్రశ్నలన్నింటికీ ఎన్టీఆర్ ఇచ్చే సమాధానం ఏంటి.. ? దీని గురించే సోషల్ మీడియా అభిమానులు చర్చించుకుంటున్నారు. అసలు ఆ ప్రశ్నలు ఏంటి..? ఎన్టీఆర్ సమాధానం ఏంటి.. ? తెలుసుకుందాం. గత కొన్నిరోజులుగా ఎన్టీఆర్ కు లక్ కలిసిరావడం లేదు అంటే నిజమే అనిపిస్తుందని నెటిజన్స్ చెప్పుకొస్తున్నారు. దేవర సినిమాతో రాజమౌళి సెంటిమెంట్ ను బ్రేక్ చేసి ఇండస్ట్రీని షేక్ చేసిన ఎన్టీఆర్ వార్ 2 తో బాలీవుడ్ లోకి అడుగుపెట్టి ఘోర పరాజయాన్ని అందుకున్నాడు. కాలర్ ఎగరేసి మరీ అభిమానులకు హామీ ఇచ్చిన ఎన్టీఆర్.. ప్రేక్షకులను కాలర్ ఎత్తనివ్వకుండా చేశాడు. ఇలా చేయడం ఎన్టీఆర్ కు ఇదేమి మొదటిసారి కాదు. అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లో కూడా ఎన్టీఆర్ కాలర్ ఎత్తి మరీ తన అభిమానులను తల దించుకోనివ్వను అని చెప్పాడు. కానీ అక్కడ కూడా మాటను నిలబెట్టుకోలేకపోయాడు. ఎన్టీఆర్ ఇలా మాట నిలబెట్టుకోకపోవడంతో.. అతని సినిమాలపై అభిమానులు నమ్మకాన్ని కోల్పోతున్నారు. ప్రస్తుతం అందరి చూపు డ్రాగన్ మీదనే ఉంది. ఆ సినిమాకు కూడా ఎన్టీఆర్ ఈ రేంజ్ గా చెప్తే.. ప్రేక్షకులు




నమ్ముతారా అనే అనుమానం కూడా లేకపోలేదు. ఇక దీన్ని పక్కన పెడితే.. ఈ మధ్య జరిగిన టీడీపీ ఎమ్మెల్యే వివాదం ఎంత సెన్సేషన్ సృష్టించిందో అందరికీ తెల్సిందే. తనను అంత పెద్ద మాట అన్నా కూడా ఎన్టీఆర్ నోరు మెదపలేదు. కనీసం నందమూరి కుటుంబం నుంచి ఒక్కరు కూడా రియాక్ట్ అవ్వలేదు. ఇక ఎన్టీఆర్ ఇప్పుడప్పుడే రాజకీయాల్లోకి రావాలనుకోవడం లేదు కాబట్టి ఇలాంటి విషయాలపై స్పందిస్తే అది ఇంకా పెద్ద వివాదంగా మారొచ్చు అనే ఆలోచనతో ఎన్టీఆర్ స్పందించకపోవచ్చు. కానీ, ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఊరుకోలేదు. ఒక పెద్ద ప్రెస్ మీట్ పెట్టి కడిగిపడేశారు. ఆ ప్రెస్ మీట్ అయినా ఎందుకు పెట్టారు అని అడిగాడట కానీ, సపోర్ట్ చేయలేదని టాక్. ఎందుకు ఎన్టీఆర్ ఇలా చేస్తున్నాడు అనేది ప్రస్తుతం ఫ్యాన్స్ లో ఉన్న పెద్ద ప్రశ్న. ఇక వీటితో పాటు అభిమానులను కలవరపెడుతున్న ప్రశ్న.. ఎన్టీఆర్ ఆరోగ్యానికి ఏమైంది..? మునుపెన్నడూ లేనివిధంగా ఎన్టీఆర్ బరువు తగ్గి కనిపించాడు. క్యారెక్టర్ కోసం బరువు తగ్గినా ముఖంలో ఎప్పుడు ఆ కళ పోలేదు. కానీ, ఈసారి మాత్రం ముఖం పీక్కుపోయింది. అసలు తారకేనా అనే అనుమానం వచ్చింది అంటే అతిశయోక్తి కాదు. సడెన్ గా చూసి పేషేంట్ అనుకున్నారు. డ్రాగన్ కోసం తగ్గుతున్నాడు అనుకున్నా.. ముఖం మొత్తం లోతుగా పోయి కనిపిస్తుంటే అది క్యారెక్టర్ కోసం అని ఎలా అనుకుంటామని ఫ్యాన్స్ భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. తారక్ ఏదైనా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడా అని అనుమానిస్తున్నారు.

# పూజా పాపను కాపాడే నాథుడే లేడా

ఇండస్ట్రీ.. ఒక రంగుల ప్రపంచం. ఇక్కడ ఎవరు ఎప్పుడు గోల్డెన్ లెగ్ అవుతారో.. ఎవరు ఎప్పుడు ఐరెన్ లెగ్ అవుతారో అనేది చెప్పడం ఎవరి వలన కాదు. ఒకప్పుడు గోల్డెన్ లెగ్ అనిపించుకున్నవారే.. ఆ తరువాత ఐరెన్ లెగ్ అనిపించుకుంటారు. ప్రస్తుతం ఇండస్ట్రీలో పూజా హెగ్డే పరిస్థితి అలానే ఉంది. స్టార్ హీరోయిన్ గా ఒక వెలుగు వెలిగిన ఈ చిన్నది.. ఇప్పుడు ఒక్క సినిమా లేక అల్లాడిపోతోంది. మాస్క్ అనే సినిమాతో ఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చింది పూజా. ఆ తరువాత ఒక లైలా కోసం అంటూ నాగచైతన్యతో జత కట్టింది. దువ్వాడ జగన్నాథం సినిమాతో అమ్మడి రేంజ్ మారిపోయింది. ఆ సినిమా ఎలాంటి విజయం అందుకుంది అనేది పక్కనపెడితే పూజా అందానికి ఇండస్ట్రీనే ఫిదా అయ్యింది. ఆ తరువాత నుంచి ఈ ముద్దుగుమ్మ ఏది పట్టుకుంటే అది బంగారం అవ్వడం మొదలుపెట్టింది. అలా అనతి కాలంలోనే స్టార్ హీరోయిన్ గా మారింది. అది మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ వరకు మాత్రమే. ఆ తరువాత సడెన్ ఆమె డౌన్ ఫాల్ మొదలయ్యింది. పాన్ ఇండియా సినిమాల నుంచి చిన్న సినిమాల వరకు.. తెలుగు నుంచి హిందీ వరకు అమ్మడు ఏది ముట్టుకుంటే అది ఫ్లాప్ అవుతూ వచ్చాయి. అరడజనుకు పైగా సినిమాల్లో పూజా నటించింది. ఏ ఒక్కటి ఆమెను మళ్ళీ బౌన్స్ బ్యాక్ చేయించలేకపోయాయి. చివరికీ కూలీ కూడా. మోనికా సాంగ్ తో పూజా మళ్ళీ రీఎంట్రీ ఇస్తుంది అనుకున్నారు. అందుకు తగ్గట్టే చిన్నది పావులు కూడా కదిపింది. అందులో భాగంగానే దుల్కర్ సల్మాన్ సరసన నటించే ఒక లక్కీ ఛాన్స్ పట్టేసింది. సుధాకర్ చెరుకూరి నిర్మాణంలో దుల్కర్ హీరోగా రవి నేలకుడితి అనే కొత్త దర్శకుడిని పరిచయం చేస్తూ ఒక సినిమా చేస్తున్నారు. ఆ సినిమాకు పూజా సైన్ చేసినట్లు తెలిపింది. గుంటూరు కారం నుంచి తప్పుకున్నాకా పూజా తెలుగులో



ఒక్క ప్రాజెక్ట్ కూడా ఓకే చెప్పలేదు. దీంతో దుల్కర్ సినిమాపై అమ్మడు ఎన్నో ఆశలు పెట్టుకుంది. అందుతున్న సమాచారం ప్రకారం దుల్కర్ సినిమా నుంచి కూడా పూజా తప్పుకుందని టాక్. ఆమె తప్పుకోలేదు.. వారే తీసేశారని ఇండస్ట్రీ వర్గాల గుసగుస. పూజా ప్లేస్ లో శృతి హాసన్ ను అనుకుంటున్నారని, త్వరలోనే అధికారికంగా కూడా ప్రకటించనున్నారని టాక్ నడుస్తోంది. ఇదే కనుక నిజమైతే పూజా బ్యాడ్ లక్ ఇంకా కంటిన్యూ అవుతున్నట్టే. ఈ రేంజ్ గా ఫ్లాపుల్లో కూరుకుపోయిన పూజా పాపను పైకి లాగే నాథుడు ఎవరు అని అటు ఇండస్ట్రీ.. ఇటు అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. మరి ఆ సమయం ఎప్పుడు వస్తుంది అనేది తెలియాలి.

# కెరీర్‌లోనే ది బెస్ట్‌గా

యువ హీరో హవీష్ కథానాయకుడిగా నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో 'నేను రెడీ' అనే సినిమా రూపొందుతున్నది. కావ్య థాపర్ ఇందులో హీరోయిన్. నిఖిల కోనేరు నిర్మాత. నిర్మాణంలో ఉన్న ఈ సినిమా నుంచి కావ్య థాపర్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాలోని తన పాత్ర ఆడియన్స్‌ని ఆకట్టుకుంటుందని, తన కెరీర్‌లోనే ది బెస్ట్‌గా ఈ సినిమా నిలుస్తుందని కావ్య చెబుతున్నారు.

ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నదిఇందులో తన పాత్ర ప్రేక్షకులను మెప్పిస్తుందని కావ్య చెప్పారు. ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది, ప్రేక్షకులను ఆకట్టుకొనే హంగులతో ఈ చిత్రం రూపొందుతోంది అని నిర్మాత నిఖిల చెప్పారు.. శ్రీలక్ష్మి, గోపరాజు రమణ, హరి తేజ, మహతి, రూప లక్ష్మి, జయవాణి, మాణిక్‌రెడ్డి, బలగం సత్యనారాయణ, రోహన్ రాయ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు: విక్రాంత్ శ్రీనివాస్, కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: మిక్కీ జె.మేయర్, నిర్మాణం: హార్నిక్స్ ఇండియా ఎల్ ఎల్ పి.



# మిరాయి మెరుపులు

హను-మాన్'ఫేం తేజ సజ్జా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'మిరాయ్'. ఇందులో తేజ సజ్జా సూపర్ యోధాగా కనిపించనున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2డి, 3డి ఫార్మాట్‌లలో, ఎనిమిది భాషల్లో సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. శనివారం హీరో తేజ సజ్జా పుట్టినరోజు. ఈ సందర్భంగా మేకర్స్ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ఇందులో సూపర్ యోధగా తేజ సజ్జా కనిపిస్తున్నారు. ఆయన పాత్రలో ఉండే పట్టుదల, ధైర్యం, 'మిరాయి' కథలో ఉండే హై వోల్టేజ్ డ్రామాను ఈ లుక్ ప్రజెంట్ చేస్తున్నది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమా హిందీ వెర్షన్‌ను బాలీవుడ్ టాప్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. మంచు మనోజ్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయిక. శ్రియ శరణ్, జయరామ్, జగపతిబాబు ఇతరపాత్రధారులు. ఈ చిత్రానికి మాటలు: మణిబాబు కరణం, సంగీతం: గౌరహరి. ఇదిలావుంటే.. 'మిరాయ్' చిత్రాన్ని నిర్మిస్తున్న పీపుల్ మీడియా సంస్థలోనే తేజ సజ్జా మరో సినిమా చేయబోతున్నారు. ఈ సినిమా కూడా 'మిరాయ్' తరహాలో భారీగానే ఉంటుందని శనివారం నిర్మాతలు ప్రకటించారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613